


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

28.07.2026
మంగళవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 28
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


### ప్రభుత్వ పాఠశాలల్లో
# అల్పాహార పథకం

- ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ..
- విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టి
- పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారు
- సహజ వనరులు ఎంత ముఖ్యమో,
- మానవ వనరులు కూడా అంతే ముఖ్యం



**హైదరాబాద్, జులై 27, అనంత జనశక్తి న్యూస్**
తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. 2లో..

సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధి పై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థు లకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్ర మమని వ్యాఖ్యానించారు.
ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రా ష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరి స్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు.

---

## రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి

- అయోధ్య విరాళాల చోరీపై సుప్రీం
- రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం
- సిట్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు
- చార్టర్డ్ అకౌంటెంట్‌ను సభ్యుడిగా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశం
- ఐజీ కిరణ్ ఎస్. నేతృత్వంలో దర్యాప్తు 2లో..

---

### కేసుల విత్‌డ్రాపై
## ఆదేశాలు లేవు

- సీజేపీ నిరసనపై ఢిల్లీ పోలీసులు
- కేసుల ఉపసంహరణ వ్యవహారం
- ప్రభుత్వం ఆదేశిస్తేనే చట్టపరమైన ప్రక్రియ

**న్యూఢిల్లీ, జులై 27, అనంతజనశక్తి న్యూస్**
కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ), యువత జంతర్ మంతన్ వద్ద చేసిన నిరసనల్లో నమోదైన కేసుల్ని విత్ డ్రా చేసుకోవాలి కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని ఢిల్లీ పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయిన తర్వాత మాత్రమే చట్టపరమైన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, చివరకు కోర్టులదే నిర్ణయమని చెప్పినట్లు సమాచారం. సీజేపీ ఆందోళన విరమణకు పెట్టిన షరతుల్లో కేసుల ఉపసంహరణ కూడా ఉంది. ప్రభుత్వం దీనికి అంగీకరించింది. 2లో..

---

### దుబాయ్–ముంబై ఇండిగో
## విమానంలో మంటలు

- రాజ్‌కోట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్
- 194 మంది ప్రయాణికులు సురక్షితం



2లో..

---

### సింగరేణికి తీరని అన్యాయం
## మొత్తం కేసీఆరే కారణం..

- కేసీఆర్‌పై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు
- సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు
- జెన్కోకు కీలక సూచన.. పేపర్ లీక్ చట్టంపై వ్యాఖ్యలు 2లో..



---

### నాణ్యమైన బియ్యం
## కిలో రూ.52కే లభ్యం

ఆగస్టు 1 నుంచి అందు బాటులోకి
డిప్యూటీ సీఎం పవన్ ప్రకటన 2లో..



---

### కేంద్రం హామీలను
## నిలబెట్టుకోవట్లేదు

- సీజేపీ ప్రతినిధుల ఆరోపణలు
- కేసులు ఉపసంహరించుకోవాలి


**న్యూఢిల్లీ, జులై 27, అనంతజనశక్తి న్యూస్**
కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించుకుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. 2లో..

---

## బతకాలని ఉన్నా.. బాధ భరించలేకపోతున్న

- చంద్రబాబును స్పీచ్‌తో మెప్పించిన బాలిక ఆత్మహత్య
- కన్నీళ్లు పెట్టిస్తున్న సూసైడ్ నోట్
- విచారణకు ఆదేశించిన సీఎం

**అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును తన ప్రసంగంతో ఆకట్టుకున్న పదో తరగతి విద్యార్థిని శివాని ఆత్మహత్య తీవ్ర విషాదాన్ని నింపింది. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఇర్లపల్లి కొత్త కాలనీలో శివాని ఆత్మహత్య చేసుకుంది. శివాని రేకుల షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సోమవారం ఉదయం గుర్తించారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఆస్పత్రికి తరలించారు. 2లో..



---

### ఆకివీడులో రామాలయ నిర్మాణానికి
## సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

- ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ..
- దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం కోర్టు

**అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్**
పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలో రామలయం నిర్మాణానికి సంబంధించి జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) సుప్రీంకోర్టు సమర్థించింది. ప్రభుత్వ భూమిలో ఆలయ నిర్మాణాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే ఈ ప్రాజెక్టుపై ఏవైనా సరైన అభ్యంతరాలు ఉంటే, కొత్తగా పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని కోర్టు పేర్కొంది. ఆ ప్రదేశంలో 80 ఏళ్లకు పైగా రామ మందిరం ఉన్నట్లు రికార్డులు సూచిస్తున్నాయని, ఆకివీడులో రామలయం నిర్మాణానికి ఎలాంటి చట్టపరమైన అడ్డంకి లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 5లో..

---

## డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధం



2లో..

**అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్**
డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే చర్చకు రావాలని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

- జగన్‌కు లోకేశ్ సవాల్
- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు
- వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్, భూకుంభకోణాలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం



## కేసుల విత్‌డ్రాపై
# ఆదేశాలు లేవు

**న్యూఢిల్లీ, జులై 27, అనంతజనశక్తి న్యూస్**

కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ), యువత జంతర్ మంతన్ వద్ద చేసిన నిరసనల్లో నమోదైన కేసుల్ని విత్ డ్రా చేసుకోవాలి కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని ఢిల్లీ పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయిన తర్వాత మాత్రమే చట్టపరమైన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, చివరకు కోర్టులదే నిర్ణయమని చెప్పినట్లు సమాచారం. సీజేపీ ఆందోళన విరమణకు పెట్టిన షరతుల్లో కేసుల ఉపసంహరణ కూడా ఉంది. ప్రభుత్వం దీనికి అంగీకరించింది.
ఇదిలా ఉంటే, నిరసనల సందర్భంగా జర్నలిస్టులపై దాడి జరిగిందంటూ నమోదైన కేసులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఉపసంహరించుకునేది ఢిల్లీ పోలీసులు చెబుతున్నట్లు తెలుస్తోంది. జూలై 20న చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ర్యాలీ హింసాత్మకం మారడంతో, నిరసనకారులపై చాలా కేసులో నమోదయ్యామయి. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 20 కేసులు నమోదయ్యాయి. మిగిలినవి జర్నలిస్టులపై దాడుల కేసులని పోలీసులు తెలిపారు. ప్రభుత్వం కేసుల ఉపసంహరణపై ఆదేశాలు జారీ చేస్తే, ప్రాసిక్యూషన్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు నివేదిక పంపుతుంది. ఆమోదం తర్వాత సంబంధిత కోర్టులకు ప్రాసిక్యూషన్ కొనసాగించబోమని పోలీసులు తెలియజేస్తారు. అనంతరం కేసులపై తుది నిర్ణయం కోర్టులు తీసుకుంటాయి.

## కేంద్రం హామీలను
# నిలబెట్టుకోవట్లేదు

(మొదటిపేజీ తరువాయి)

అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళనకారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా , జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

**బిహార్‌లో విద్యార్థులపై ఏకే-47 తుపాకులు: రాహుల్ గాంధీ**

బిహార్‌లో విద్యార్థులు నిరసన చేస్తున్న సమయంలో పోలీసులు వారిపైకి ఏకే47 తుపాకులతో కాల్పులు జరిపారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీలోనూ విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు వాడారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మాట నిలుపుకోదని.. విద్యార్థుల గొంతులను అణచివేసేందుకే వారు తప్పుడు హామీలు ఇచ్చారని విమర్శించారు. కాగా.. జులై 25న 'బిహార్ బంద్' సందర్భంగా జరిగిన ఆందోళనల సమయంలో సివాన్ జిల్లాలో ఓ పోలీసు కానిస్టేబుల్ నిరసనకారులపై ఏకే47 ఎక్కుపెట్టిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఇది వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే సదరు కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

## సింగరేణికి తీరని అన్యాయం
# మొత్తం కేసీఆరే కారణం..

(మొదటిపేజీ తరువాయి)



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు.

నైని కోల్ బ్లాక్ పురోగతి , జెన్కో పోటీపై హెచ్చరిక

2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల 2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.
అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేపర్ లీకేజీల నిరోధానికి కఠిన చట్టం..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీపేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం

(మొదటిపేజీ తరువాయి)

మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు.
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి

**లక్నో, జులై 27, అనంతజనశక్తి న్యూస్**

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కేసును సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ముందు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం తన వాదనల్ని వినిపించింది. రాష్ట్ర ప్రభుత్వం తరుపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. పారదర్శకమైన దర్యాప్తు జరిగేలా చూసేందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలియజేశారు.
ఇదిలా ఉంటే, సీనియర్ ఐపీఎస్ అధికారులతో పాటు ఫోరెన్సిక్ ఆడిట్‌లో అనుభవం ఉన్న చార్టర్ట్ అకౌంటెంట్‌ను సభ్యులుగా చేర్చిన కొత్త సిట్ ఏర్పాటు చేయాలని యూపీ సర్కార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. కొత్త సిట్‌కు లక్నో రేంజ్ ఐజీ కిరణ్ ఎస్. నేతృత్వం వహించనున్నారు. సభ్యులుగా అయోధ్య రేంజ్ డీఐజీ సోమెన్ బర్మా, అయోధ్య ఎస్ఎస్పీ గౌరవ్ గ్రోవర్ ఉన్నారు. కోర్టు సూచన మేరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిపుణుడైన చార్టర్డ్ అకౌంటెంట్‌ను కూడా సిట్‌లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.
నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉన్నందున ఆర్థిక అంశాలను పరిశీలించేందుకు నిపుణులు అవసరమని కోర్టు అభిప్రాయపడింది. విచారణ సందర్భంగా పిటిషన్ల తరుపు న్యాయవాది, ఆలయానికి వచ్చే నిధులు, విరాళాల వివరాలను ట్రస్ట్ వెబ్ సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అయితే, ఈ అంశాన్ని అనవసరంగా సంచలనంగా మార్చొద్దని సొలిసిటర్ జనరల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తుపై రెండు వారాల్లో స్టేటస్ రిపోర్టు సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.



# దుబాయ్–ముంబై ఇండిగో విమానంలో మంటలు

**ముంబై, జులై 27, అనంత జనశక్తి న్యూస్**

దుబాయ్ నుంచి ముంబైకి వస్తున్న ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. విమానంలో పొగలు రావడంతో సోమవారం అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో రాజ్‌కోట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసింది. విమానంలో మంటలు కనిపించడంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. దీంతో అధికారులు వెంటనే స్పందించి అన్ని ఏర్పాట్లు చేశారు. పైలట్ అప్రమత్తతతో విమానం సురక్షితంగా రాజ్‌కోట్ విమానాశ్రయంలో దిగింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్‌లు విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ప్రయాణికులందరినీ సురక్షితంగా బయటకు తరలించారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. దీంతో విమానంలో ఉన్న 194 మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. విమానంలో పొగ కనిపించడంతో పైలట్ వెంటనే రాజ్‌కోట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. పరిస్థితిని అంచనా వేసిన అధికారులు వెంటనే రన్‌వేను సిద్ధం చేసి విమానాన్ని సురక్షితంగా దించారు. రాజ్‌కోట్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు. ఇటీవలి నెలల్లో ఇండిగో విమానానికి సంబంధించి ఇది రెండో అత్యవసర ఘటన కావడం గమనార్హం. గత మే నెలలో హైదరాబాద్ నుంచి చండీగఢ్‌కు వెళ్లిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలడంతో క్యాబిన్‌లో పొగ వ్యాపించింది. ఆ సమయంలో విమానం షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయి పార్కింగ్ బే వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. విమాన సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చినప్పటికీ.. క్యాబిన్ మొత్తం పొగతో నిండిపోవడంతో అత్యవసరంగా ఇన్‌ఫ్లేటబుల్ స్లైడ్‌ల ద్వారా ప్రయాణికులను బయటకు తరలించారు. ఆ ఘటనలో ఒక ప్రయాణికుడు స్వల్పంగా గాయపడగా.. మిగిలిన వారందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రస్తుతం దుబాయ్‌ముంబై ఇండిగో విమానంలో పొగ రావడానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# బతకాలని ఉన్నా..
# బాధ భరించలేకపోతున్న

(మొదటిపేజీ తరువాయి)

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆత్మహత్యకు ముందు రాసిన లేఖ కంటతడి పెట్టిస్తోంది.
'సారీ అమ్మా.. నా కోసం చాలా కష్టపడ్డావు. కానీ నీ కలను నెరవేర్చలేకపోతున్నా.. బతకాలని ఉన్నా ఈ బాధను భరించలేకపోతున్నా.. బతకడం కష్టంగా అనిపిస్తోంది.. ఈ బాధ మోయడం నావల్ల కావడం లేదు. నీ కోసం ఏమీ చేయలేకపోతున్నా డాడీ. మీ కోసం చాలా కష్టపడదాం అనుకున్నాను. మీరు కలలుగన్న జీవితం మీకిద్దాం అనుకున్నాను. కానీ నేను అనుకున్నది చేయలేకపోతున్నాను. నేను చనిపోయాక నాపై కోప్పడకండి. నన్ను ఎప్పుడూ లవ్ చేస్తూనే ఉండండి. అన్నయ్య, వదిన, అమ్మ, అమ్మమ్మా.. మీరు ఇప్పటికైనా కలవండి. ద్వేషించుకోకండి' అంటూ బాలిక ఆవేదనను వ్యక్తం చేస్తూ లేఖ రాసింది. కుటుంబంలో వివాదాల కారణంగా శివాని ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుటుంబంలో కలహాలు ఆమెను ఎంతో బాధపెట్టాయో ఈ లేఖ ద్వారా అర్థమవుతుంది. నాలుగు రోజుల క్రితం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న బాలిక ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకోవడం కుటుంబసభ్యుల్ని కలిచివేసింది.
శివాని మరణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఆమె ఆత్మహత్య చేసుకోవడం



ఆవేదన కలిగిచిందన్నారు. 'పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆ రోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవ్వడం నన్ను కలిచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవ్వరూ ఒత్తిడికి, నిరాశ, నిస్పృహలకులోను కావొద్దని కోరుతున్నాను. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధను, ఆవేదనను మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని, అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని తెలియజేస్తున్నాము' అంటూ ట్వీట్ చేశారు.
శివాని రంపచోడవరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 24న పోలవరం జిల్లా రంపచోడవరంలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో శివాని తన ప్రసంగంతో అందరిని ఆకట్టుకున్నారు. వచ్చే ఏడాది షైనింగ్ స్టార్ అవార్డు తీసుకుంటానని సీఎంకు ధీమాతో చెప్పారు.. చంద్రబాబు ఆమెను పిలిచి పక్కన కూర్చొపెట్టుకొని ప్రశంసించారు. అయితే ఇవాళ ఆమె ఆత్మహత్య చేసుకోవడం విషాదాన్ని నింపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అంత ధైర్యంగా మాట్లాడిన బాలిక ఆత్యహత్య చేసుకోవడం ఏంటనే చర్చ జరుగుతోంది.

## నాణ్యమైన బియ్యం
# కిలో రూ.52కే లభ్యం

**అమరావతి, జులై 27, అనంతజనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 రా రైస్ రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు.
'బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుంది.' అని పవన్ కళ్యాణ్ విశ్వాసం వ్యక్తంచేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో భవిష్యత్తులో చేపట్టనున్న సంస్కరణలు, కార్యాచరణకు కేంద్ర సహకారం కోరుతూ ఢిల్లీలో రెండు రోజుల పర్యటనకు వెళ్లారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దేందుకు చేపట్టనున్న సంస్కరణలు, పరస్పర సహకారం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.



## డీఎస్సీపై బహిరంగ
# చర్చకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు. ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు.
తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు.
ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్ల బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.



# కేంద్రం హామీలను నిలబెట్టుకోవట్లేదు



**- సీజేపీ ఆరోపణలు**

కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించుకుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు.

ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళనకారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

**బిహార్‌లో విద్యార్థులపై ఏకే47 తుపాకులు: రాహుల్ గాంధీ**

బిహార్‌లో విద్యార్థులు నిరసన చేస్తున్న సమయంలో పోలీసులు వారిపైకి ఏకే47 తుపాకులతో కాల్పులు జరిపారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దిల్లీలోనూ విద్యార్థులపై పెల్లెట్‌గన్‌లు వాడారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మాట నిలుపుకోదని.. విద్యార్థుల గొంతులను అణచివేసేందుకే వారు తప్పుడు హామీలు ఇచ్చారని విమర్శించారు.

కాగా.. జులై 25న 'బిహార్ బంద్' సందర్భంగా జరిగిన ఆందోళనల సమయంలో సివాన్ జిల్లాలో ఓ పోలీసు కానిస్టేబుల్ నిరసనకారులపై ఏకే47 ఎక్కుపెట్టిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో ఇది వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే సదరు కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

# లోక్‌సభ ముందుకు.. యాంటీ పేపర్ లీక్ బిల్లు




పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది ఈ చట్టాన్ని సవరించేందుకు ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు ఇప్పటివరకు 35 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 510 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ప్రస్తుత సవరణలకు ఆమోదం లభిస్తే.. భాగంగా దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

# కెనడాలో భారత యువతి హత్య




కెనడాలో పంజాబ్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. టొరంటో నగరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నవ్‌నీత్ కౌర్ (26) బులేవార్డ్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను వెంబడించాడు. కొద్దిసేపు ఆమెతో మాట్లాడిన అనంతరం ఒక్కసారిగా తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఘటనాస్థలంలోనే మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరి మధ్య ఎలాంటి వాగ్వాదం జరగకుండానే నిందితుడు కాల్పులకు పాల్పడ్డాడు.

ఈ కేసులో 37 ఏళ్ల శరణ్‌జీత్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిది కూడా పంజాబేనని గుర్తించారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డ్రోన్లు, ఇతర సాంకేతిక పరికరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇది టార్గెటెడ్‌గా చేసిన హత్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అయితే హత్య వెనుక అసలు ఉద్దేశం ఏంటనేది తెలియాల్సి ఉందన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే కెనడాలోని ఎడ్మంటన్‌లో భారత్‌కు చెందిన మరో యువతి హత్యకు గురైన సంగతి తెలిసిందే. 23 ఏళ్ల దమన్‌ప్రీత్ కౌర్‌ను రితీష్ కుమార్ (22) గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

## భారత నావికుడి మృతి.. ఉక్రెయిన్ దౌత్యవేత్తకు కేంద్రం సమన్లు



: ఒకవైపు హర్మూజ్ జలసంధిలో భారత నావికుల ప్రాణాలు ప్రమాదంలో ఉండగా.. మరోవైపు నల్ల సముద్రంలో రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలతో అదే పరిస్థితి ఎదురవుతోంది. నల్లసముద్రంలో ఒక వాణిజ్యనౌకపై జరిగిన దాడిలో భారత నావికుడు సాగర్ గుప్తా ప్రాణాలు కోల్పోయారు. జులై 18న మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉన్నI నౌక రష్యా జలాల్లో ప్రయాణిస్తుండగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన కేంద్ర ప్రభుత్వం ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్‌కు సమన్లు జారీచేసింది . వాణిజ్య నౌకలపై దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, సముద్ర వాణిజ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని ఘర్షణలో భాగమైన దేశాలకు హితవు పలికింది. సాగర్ గుప్తా నౌకలో చీఫ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నల్ల సముద్రంలో రష్యాకు సమీపంలో ఉండగా ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో అతడు చనిపోయినట్లు ఎఫ్‌ఎస్‌యూబి తెలిపింది. దాడి జరిగినప్పుడు ఆ నౌకలో 10 మంది సిబ్బంది ఉన్నారని.. వారిలో ముగ్గురు భారతీయులని పేర్కొంది.

# ఈ20 ఇంధనం విషయంలో పోస్టులు.. హైకోర్టును ఆశ్రయించిన గడ్కరీ



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ పలువురు నెటిజన్లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు, పోస్టులు పెడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన పరువుకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు చేసేవారిపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇటువంటి కంటెంట్‌ను వ్యాప్తి చేసేందుకు సహకరించిన మెటా, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సివిల్ దావా వేసేందుకు కోర్టు ఆయనకు అనుమతి ఇచ్చింది.

E20 ఇంధన కార్యక్రమానికి సంబంధించి కేంద్రమంత్రిపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారన్న ఆరోపణలపై నలుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై నాగ్‌పూర్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైన దాదాపు రెండు వారాల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. వీరిలో ప్రముఖ యూట్యూబర్‌రాజకీయవేత్త మనీష్ కశ్యప్, ఇన్‌ఫ్లుయెన్సర్లు హర్షిత్ రాఠీ, అంక్లేష్ ఇన్వతీ ఉన్నారు. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రోత్సహిస్తున్నారు. దానివల్ల వాహనాల ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న ఆరోపణలను పలుమార్లు ఆయన కొట్టిపారేశారు. దేశం ఏటా ఇంధన దిగుమతుల కోసం రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఇథనాల్ తయారు చేయాలనే నిర్ణయంతో రైతులకు దాదాపు రూ.45వేల కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. ఇథనాల్ బ్లెండింగ్‌పై జరుగుతోన్న ప్రచారం కేవలం పెయిడ్ క్యాంపెయిన్ అని.. అందులో ఎటువంటి వాస్తవం లేదని తెలిపారు.


# ఆస్పత్రి నుంచి సోనమ్ వాంగ్‌చుక్ డిశ్చార్జి



పర్యావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్ (గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అక్కడి నుంచి ఆయన నేరుగా రాజ్‌ఘాట్‌కు వెళ్లి.. మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పించనున్నారు. ఆ తర్వాత లద్దాఖ్ బయల్దేరి వెళ్లనున్నారు. ఈ మేరకు వాంగ్‌చుక్ 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్టు చేశారు. ఇన్నాళ్లూ తనకు వైద్య సేవలు అందించిన వైద్యులు, అక్కడి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జూన్ 28న జంతర్‌మంతర్ వద్ద ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణిస్తుండటంతో దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు జులై 18న ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. అయితే, వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని.. ప్రైవేటు ఆస్పత్రికి తరలించేందుకు అనుమతివ్వాలని దిల్లీ హైకోర్టులో ఆయన భార్య గీతాంజలి పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం అంగీకరించింది. దీంతో జులై 22న ఆయన్ను మేదాంత ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. పేపర్ లీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇవ్వడంతో నిరాహార దీక్షను విరమించారు. కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో ఈ నెల 23 అర్ధరాత్రి దాటిన తర్వాత దీక్షను ముగించారు.

## పీవోకేపై అయితేనే పాక్‌తో చర్చలు



**- స్పష్టం చేసిన రాజ్‌నాథ్ సింగ్**

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) గురించి తప్ప మరే అంశంపైనా పాకిస్థాన్‌తో మన దేశం చర్చలు జరపబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఆ దేశం జాతీయ విధానంగా మార్చుకుందంటూ విమర్శించారు. పాక్ ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా.. దాని ఊహకు కూడా అందనంత రీతిలో దెబ్బకొడతామని హెచ్చరించారు. 27వ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని కార్గిల్ యుద్ధ స్మారకంవద్ద రాజ్‌నాథ్ ఆదివారం నివాళులర్పించి ప్రసంగించారు. ఉగ్రవాదంతో భారత్‌ను భయపెట్టాలని చూసేవారి గతి ఏమవుతుందో ఆపరేషన్ సిందూర్ స్పష్టంగా చాటి చెప్పిందని పేర్కొన్నారు.

కార్గిల్ యుద్ధ వీరులకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో అత్యంత కఠిన పరిస్థితుల్లోనూ మన సైనికులు చూపిన తెగువ దేశానికి ఎప్పుడూ గర్వకారణమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## భర్తను మోస్తూ.. 180కి.మీ. యాత్ర




వ్యాధిగ్రస్థుడైన భర్తను తలపై మోసిన సతీ సుమతి కథను పురాణాల్లో చదివాం. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఆశా అనే మహిళ దివ్యాంగుడైన భర్తను 180 కి.మీ. భుజాలపై మోస్తూ కావడి యాత్రను పూర్తి చేసింది. హరిద్వార్‌లో కావడి యాత్ర ఇంకా ప్రారంభం కాకముందే చాలా మంది యాత్రికులు అక్కడికి చేరుకున్నారు. గాజియాబాద్ జిల్లా మోదీనగర్‌కు చెందిన ఆశా తన భర్త సచిన్‌తో కలిసి హరిద్వార్‌కు వెళ్లింది. కొన్నాళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో సచిన్ గాయపడి పూర్తిగా నడవలేని స్థితికి చేరుకున్నాడు. భర్త కోరిక మేరకు కావడి యాత్ర తలపెట్టిన ఆశా అతడిని భుజాలపై మోస్తూ ఈ యాత్రను పూర్తి చేసింది.

## దేశాభివృద్ధిలో భాగమవుతా



భారతీయ పౌరురాలిగా తానెంతో గర్విస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఏపీలోని చిత్తూరు జిల్లా తవణంపల్లెకు చెందిన భవ్యశ్రీ అన్నారు. 'వికసిత్ వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రాం'లో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువతతో వర్చువల్‌గా మాట్లాడారు. బీటెక్ పూర్తిచేసిన భవ్యశ్రీ ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ఆమె హైదరాబాద్‌లోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'మై భారత్ పోర్టల్‌లో నిర్వహించే క్విజ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. ఉత్తరాఖండ్‌లో పర్యటించాను. అక్కడి భౌగోళిక పరిస్థితులు తెలుసుకున్నా. ప్రజలు ఐకమత్యంతో ఉంటే దేశం అభివృద్ధి సాధిస్తుంది. దేశాభివృద్ధిలో పాలుపంచుకుంటాను' అని తెలిపారు.

## తల్లిని చంపిన హంతకుడిని పట్టించిన ఐదేళ్ల బాలుడు



తన తల్లిని హత్య చేసిన తండ్రిని ఐదేళ్ల బాలుడు పోలీసులకు పట్టించిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్ (UP)లోని మహోబా జిల్లాలో వెలుగు చూసింది. బిజ్రారీ గ్రామానికి చెందిన హనీఫ్ అనే వ్యక్తి పోలీసులకు ఫోన్ చేసి.. తన భార్య తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు చెప్పాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతురాలిపై పదునైన ఆయుధంతో దాడి చేసి, హత్య చేసినట్లు గుర్తించారు. విచారణ సమయంలో పొంతన లేని సమాధానాలు చెప్పడంతో హనీఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వారి ఐదేళ్ల కుమారుడితో పోలీసులు మాట్లాడగా.. తన తండ్రే కొడవలితో తల్లిపై దాడి చేశాడని చెప్పాడు. చిన్నారి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా విచారణ జరపగా.. నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. శనివారం రాత్రి హనీఫ్ మద్యం మత్తులో ఇంటికి వచ్చి.. తన భార్య మనీషా (27)తో గొడవపడ్డాడు. ఈ క్రమంలోనే నిందితుడు విచక్షణ కోల్పోయి కొడవలితో ఆమెపై దాడి చేశాడనిపోలీసులు వెల్లడించారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతురాలు ఎనిమిది నెలల గర్భిణి అని.. కడుపులోని బిడ్డ కూడా ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. దాడి జరిగిన సమయంలో వారి కుమారుడు, రెండేళ్ల కుమార్తె అక్కడే ఉన్నారు. తల్లి హత్యను చూసినప్పటి నుంచి ఆ పిల్లాడు తీవ్ర భయాందోళనకు గురవడంతో అతడిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.



# భద్రతకు స్నేహబంధాలు!

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తరవాత చేపట్టిన విధానాలు అమెరికా విశ్వసనీయతపై అనుమానాలూ ఆందోళనలను రేకెత్తించాయి. దాంతో అమెరికా మిత్రదేశాలన్నీ ఆర్థిక, రక్షణ, వ్యూహాత్మక రంగాల్లో అగ్రరాజ్యంపై ఆధారపడటం తగ్గిస్తున్నాయి. తమలోతాము సహకరించుకుంటున్నాయి. ప్రపంచంలో వస్తున్న ఈ మార్పుల మధ్య భారత్ కూడా ప్రాంతీయంగానూ, కొంత దూరంలోని దేశాలతోనూ సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో పట్టు పెంచుకోవడానికీ అడుగులు వేస్తోంది.

ఒక దేశాధినేత మరో దేశాధినేత విదేశీ పర్యటనపై స్పందించడం, అదికూడా ఎంతో సానుకూల వ్యాఖ్యలు చేయడం మామూలు విషయం కాదు. ఇక్కడ ప్రస్తావిస్తున్నది భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ చేసిన ప్రకటన గురించి. ఈ పర్యటన 'భారత్, న్యూజిలాండ్‌ల మధ్య మైత్రిని పరిపుష్ఠం చేసి, రెండు దేశాల ప్రగతికి ఊపునిస్తుంద'ని ఆకాంక్షిస్తున్నట్లు జే మ్యూంగ్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇండోనేసియా, ఆస్ట్రేలియాలతో పాటు న్యూజిలాండ్‌నూ సందర్శించిన మోదీ- తన విదేశ యాత్రపై 'మిత్రుడి' ట్వీట్‌ను ప్రశంసించారు. ఆ సంగతిని అలా ఉంచితే- చైనా, అమెరికా కలిసి 'గ్రూప్ ఆఫ్ టూ'గా ఏర్పడతాయనే అంచనాలున్నాయి. అమెరికా చపలచిత్త విధానాలు, చైనా దూకుడు నేపథ్యంలో ఇండో-పసిఫిక్ ప్రాంత (ఐవోఆర్) దేశాలు తమ బంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నాయి.

**ఉమ్మడి ప్రయోజనాలకు ఒప్పందాలు**

అమెరికా తన నౌకాదళ విభాగమైన ఇండో-పసిఫిక్ కమాండ్ పేరును తిరిగి యూఎస్ పసిఫిక్ కమాండ్‌గా మార్చింది. మిత్రులు, ప్రత్యర్థులనే తేడా లేకుండా అన్ని దేశాలపై సుంకాలు పెంచేస్తూ ఒత్తిడిని కొనసాగిస్తోంది. నిలకడ లేని వాణిజ్య విధానాలను అనుసరిస్తోంది. ఇవన్నీ కలిసి ఇండో-పసిఫిక్ దేశాలను కలవరపరుస్తున్నాయి. దీనికితోడు ఇటీవల దక్షిణ పసిఫిక్‌లో చైనా చేపట్టిన సుదూర బాలిస్టిక్ క్షిపణి పరీక్ష మరింత ఆందోళనకరంగా మారింది. ఈ వాతావరణంలో ఐవోఆర్‌లో నమ్మకమైన భాగస్వాములను పెంచుకోవడానికి భారత్ నడుంబిగించింది. ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనను ఈ కోణం నుంచే అర్థం చేసుకోవాలి.


మోదీ పర్యటన సందర్భంగా బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణి, అస్త్ర గగనతల క్షిపణులను కొనుగోలు చేయడానికి ఇండోనేసియా ముందుకొచ్చింది. అలాగే, ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరా ఒప్పందంపై సంతకాలు జరిగాయి. న్యూజిలాండ్‌తో కుదుర్చుకున్న సముద్ర, రక్షణ ఒప్పందాలు నైరుతి పసిఫిక్ మహాసముద్రంలో భారత్ ఉనికిని పెంచుకోవడానికి తోడ్పడతాయి. ఈ మూడు దేశాలను సందర్శించడానికి ముందే, ప్రధాని మోదీ జూన్ నెలలో సీషెల్స్‌లో పర్యటించారు. జులై ప్రారంభంలో జపాన్ ప్రధాని సనాయే తకాయిచి భారత్‌కు వచ్చారు. ఆ సమయంలో రెండు దేశాలు ఆర్థిక భాగస్వామ్య పెంపునకూ, సైనిక పరికరాల సంయుక్త అభివృద్ధికీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత్ ఇలా ద్వైపాక్షిక ఒప్పందాలే కాకుండా త్రైపాక్షిక ఒప్పందాలనూ కుదుర్చుకుంటోంది. కృత్రిమ మేధ, హరిత ఇంధనం, అరుదైన లోహాల సరఫరా గొలుసులు, డిజిటల్ మౌలిక సదుపాయాల్లో సహకార వృద్ధికి కెనడా, ఆస్ట్రేలియా, ఇండియా ఇటీవల ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాలు 2029 నాటికి గ్రీన్ షిప్పింగ్ కారిడార్‌ను ఏర్పాటు చేయబోతున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని వర్ధమాన, మధ్యశ్రేణి దేశాలు తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి మరీ సహకార వృద్ధికి ముందుకొస్తున్నాయి. సంఘర్షణల వల్ల అనిశ్చితి పెరుగుతున్న ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థలో ఈ బంధాలు ఎంతవరకు సాయపడతాయో చూడాలి.

**భారత్‌కు అత్యవసరం**

ఐవోఆర్ భద్రతా వ్యవస్థలో ఇంతవరకు కీలక పాత్ర పోషించిన అమెరికా, తన ప్రమేయాన్ని పెంచుకుంటుందా లేక వెనక్కి తగ్గుతుందా అనే విషయంలో స్పష్టత లేదు. ఇండో-పసిఫిక్ కమాండ్ పేరు మార్పు నిర్ణయాన్ని పసిఫిక్‌పై అమెరికా మరింత దృష్టి సారిస్తోందనడానికి సంకేతంగా భావిస్తున్నవారూ ఉన్నారు. అమెరికా పశ్చిమ తీరం నుంచి భారతదేశ పశ్చిమ సరిహద్దు వరకు విస్తరించిన స్వేచ్ఛాయుత మండలాన్ని కాపాడటానికి తాము ఇప్పటికీ నిబద్ధులై ఉన్నామని వాషింగ్టన్ స్పష్టం చేస్తోంది. కానీ, అమెరికా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికే ఐవోఆర్‌లో ఉంటుంది తప్ప ఇతరులకోసం కాదని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా భారత్, అమెరికా సంబంధాలు ఇటీవల కాలంలో ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. భారత్- చైనాతో సంబంధాలు ఎగుడుదిగుడులకు లోనవుతున్నాయి. పాక్‌తో ఘర్షణ వాతావరణం పెరుగుతోంది. మరోవైపు అమెరికా సుంకాలు పెద్ద సమస్యగా మారాయి. ట్రంప్ విధానాలు, ఇరాన్ యుద్ధం కారణంగా భౌగోళిక-ఆర్థిక-రాజకీయ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమయంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని దేశాలతో ఇండియా తన సంబంధాలను పటిష్ఠపరచుకోవడం చాలా అవసరం.

# 'సర్'.. ఏ అసమర్థతలకు చిహ్నం?

**మనం జ్ఞానం పొందటంలో ప్రత్యక్ష అనుభవానికి మించింది మరొకటి ఉండదు. అన్ని విషయాల్లో ఇది సాధ్యం కాకపోయినా రాజకీయాల్లో ప్రత్యక్ష అనుభవానికి ఉన్న పాత్ర చాలా ఎక్కువ. ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళించటానికి ఉద్దేశించిన (సర్) ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను చూస్తుంటే ప్రజల ప్రత్యక్ష అనుభవం చెబుతున్న పాఠాలు చాలా కఠోరంగా ఉంటున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఇంకో రెండేళ్ల తర్వాతే జరుగుతాయి. బిహార్, బెంగాల్, తమిళనాడులో లాగా ఎన్నికల ముందు హడావుడిగా ఇక్కడ సర్ చేపట్టలేదు. అంతవరకూ కాస్త ఉపశమనమే. కానీ తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్న దాన్ని, ఓటర్లలో నెలకొన్న అనేక సందేహాలను, వాళ్లు స్వయంగా సేకరించాల్సిన సమాచారాన్ని, వెలికితీయాల్సిన పత్రాలను దృష్టిలో పెట్టుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ మూడు రాష్ట్రాల్లో ఏం జరిగిందో, దానికి మూల్యం ఎవరు చెల్లించారో అర్థంచేసుకోవటం కష్టం కాదు.**



సర్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలి. ఇది ప్రాథమిక నియమం. నగరాలు, పట్టణాల్లో అది అమలవుతున్న ప్రాంతాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెబుతోంది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్‌ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇది అంతవరకే అయిపోలేదు. పూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్‌ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ ప్రక్రియలో ప్రాథమిక అడుగే సరిగా పడలేదని దీన్నిబట్టి తేలికగానే అర్థం అవుతుంది. అయినా మన యంత్రాంగం సమర్థత బ్రహ్మాండంగా ఉందని మనం సరిపెట్టుకోవాలి. అంతా సజావుగా నడుస్తోందని మనకుమనమే సర్దిచెప్పుకోవాలి. నియమాలు ఘనంగా, అమలు హీనంగా ఉండటం అనేది మన ప్రభుత్వాల సహజ లక్షణంగా భావిస్తేనే అలా చేయగలం. ముఖ్యంగా అట్టడుగు, మధ్యతరగతి వర్గాలకు వచ్చేసరికి ఎన్నో చట్టాలు, నియమాల పరిస్థితి ఇదే తీరులో ఉంటోంది. అందుకే ఏ ప్రక్షాళనలోనైనా నష్టపోయేది ఈ వర్గాలే.

కొత్తగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదుచేయటానికి ఎన్నో పత్రాలు చూడాలి. స్వయంగా బీఎల్‌ఓ ఆ వ్యక్తి నివసించే ఇంటిని సందర్శించాలి. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదనేది నియమం. ఆ నియమాన్ని కచ్చితంగా పాటించే.. ఓటర్లుగా నమోదుచేశామని చెప్పే ఎలక్షన్ కమిషన్ తాను జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులనే సర్‌లో ప్రామాణికంగా తీసుకోలేమని సుప్రీంకోర్టుకు స్వయంగా చెప్పింది. అలాగే ఆధార్ కార్డూ అందుకు ఉపయోగపడదని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టూ చివరకు ఎలక్షన్ కమిషన్ వాదననే పరిగణనలోకి తీసుకుంది. ఆధార్ కార్డుని విదేశీవ్యక్తులకు కూడా జారీచేస్తారని, అందుకే అది ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో మన ఇంగితజ్ఞానం చెబుతూనే ఉంటుంది. ఎంతమంది విదేశీయులకు అధికారికంగా ఆధార్ కార్డులు జారీ అయివుంటాయో లెక్కలుతీస్తే వారి సంఖ్య చాలా పరిమితంగానే ఉంటుంది. వాళ్లు అయినా కొన్ని పత్రాలు సమర్పించకుండా కార్డులు పొందలేరు. అతి స్వల్పసంఖ్యలో విదేశీయులు ఆధార్ పొందుతుంటే మొత్తం ఆధార్ కార్డుల ప్రామాణికతనే శంకించటం సామాన్యుల తర్కానికి అందదు. పర్యాటకులుగానో, విద్యార్థులుగానో, ఉద్యోగులుగానో, పరిశోధకులుగానో వచ్చిన విదేశీ వ్యక్తులకు ఆధార్ ఇవ్వాలన్న నిబంధనను అధికారికంగానే పెట్టుకుని ఈ వాదనను చేయటం విడ్డూరంగానూ, వైపరీత్యంగానూ భావించాలి. ఇక ఇతర దేశాల సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వాళ్లు ఆధార్ కార్డులు పొందటం ఎక్కువగానే ఉందని అనుకుందాం. మరి అందుకు కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వేళ్లన్నీ అధికారయంత్రాంగం వైపే చూపుతాయి. పోనీ వీళ్లు అయినా కేంద్ర మంత్రులు ప్రచారం చేస్తున్నట్లు కోట్లలో ఉన్నారా? సరిహద్దు రాష్ట్రాలన్నీ అక్రమ వలసదారులతో నిండిపోతున్నాయా? అని పరిశీలిస్తే అలాంటి భయానక దృశ్యం కనపడదు. అసాంలో 2025-26లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (స్పెషల్ రివిజన్) చేపట్టారు. ఆ సందర్భంగా తొలగించిన ఓట్లు 2,43,485 మాత్రమే. వీళ్లల్లో చనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయి. పోనీ ఇందులో సందేహాస్పద ఓటర్లు ఎంతమందో అధికారికంగా ప్రకటించనూలేదు. అలా ప్రకటిస్తే కనీసం అక్రమవలసదారుల గురించి ఒక అవగాహన ఏర్పరచుకునే అవకాశం ఉండేది.

సందేహాస్పద ఓటర్లందరినీ మనం అక్రమ వలసదారులుగా భావించలేం. బీఎల్‌ఓలకు సరైన పత్రాలను అందించలేని వాళ్లనూ ఆ జాబితాలో చేర్చుతారు. ఇంకో విషయాన్ని చూసినా అక్కడి అసలు పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. 1997 నుంచి 2023 వరకూ అసాంలో మొత్తం 2,44,144 మందిని అనుమానాస్పద ఓటర్లుగా భావించి వారి పౌరసత్వాన్ని తేల్చటానికి ఫారెన్ ట్రైబ్యునళ్లకు నివేదించారు. వీళ్లందరూ అక్రమవలసదారులే అనుకున్నా మొత్తం ఓటర్లలో వారు ఒకశాతం మాత్రమే ఉంటారు. కానీ వీళ్లల్లో 51,505 మందిని మాత్రమే విదేశీయులుగా తేల్చారు. మరికొందరిని భారతీయులుగానే పరిగణించారు. కొన్ని కేసులు ఇంకా ట్రైబ్యునళ్లలో నడుస్తున్నాయి. రాజకీయ లబ్ధికోసం చేసే ఆర్భాటప్రకటనలకూ వాస్తవాలకూ మధ్య దూరం మామూలుగా ఉండదని దీన్నిబట్టి స్పష్టం అవుతోంది.

తెలంగాణలో 2002లో చేపట్టిన సర్ తర్వాత ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటువేసిన వారందరూ కూడా ఇప్పుడు మళ్లీ తమని తామే నిఖార్సైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించగలిగినవాళ్లు కూడా 2002 నాటి సర్ జాబితాలో తమ పేర్లు వెతుక్కోటానికి కిందామీదా పడుతున్నారు. గంటలపాటు దానికోసం ప్రయత్నించి విఫలమై చివరకు 2002నాటి సర్‌లో తమపేరు లేదనే వెసులుబాటును ఉపయోగించుకుని ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తిచేస్తున్నారు. దీనికి ఫోన్‌నంబరు, ఆధార్ కార్డు వివరాలను సమర్పించి వాటి ఆధారంగా వచ్చే ఓటీపీలతో (వన్ టైం పాస్‌వర్డ్స్) ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. 2002 నాటి సర్ జాబితాతో సంబంధం లేకుండానే ఓటర్లుగా కొనసాగే అవకాశం ఉంటే అసలు దాంతో మొత్తం ప్రక్రియను ఎందుకు ముడిపెట్టాల్సి వచ్చిందనే ప్రశ్న తలెత్తకమానదు. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. 2002 నాటి సర్ ఎంతచక్కగా జరిగిందో తెలుసుకోవాలంటే అప్పటి పత్రికల కథనాలు చూస్తేగానీ విషయం అర్థంకాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు సర్‌కు సంబంధించి ప్రత్యేక హడావుడి కనపడలేదు. మామూలు ఓటర్ల జాబితా సవరణ లాగే అది జరిగిపోయింది. బహుశా అప్పుడు ఎన్నికలు లేకపోవటం కూడా అందుకు కారణమై ఉంటుంది. దీనికి భిన్నంగా ఇటీవల బిహార్, బెంగాల్, తమిళనాడుల్లో తగిన సమయం ఓటర్లకు ఇవ్వకుండా హడావుడిగా సర్ చేపట్టటంతోనే తీవ్రస్థాయిలో వివాదాలు చెలరేగాయి. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రచారాల్లో మునిగిపోయిన సందర్భంలో సర్ చేపట్టటం అనుచితంగానే కనపడుతుంది. ఆ అనుచిత చర్యలే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నించేలా ఆస్కారం కల్పించాయి. అధికార వ్యవస్థలన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం కావాల్సిన రీతిలో ఒరిగిపోతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు చేపట్టిన సర్‌పై అనుమానాలు కలగకుండా ఉండవు. ఇప్పుడే బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితి ఉంటే 2002లో సర్ అంతా సక్రమమని భావించి దాన్ని ప్రామాణికంగా తీసుకోవటం ఏ మాత్రం సహేతుకంగా అనిపించదు. అప్పటికి మొబైల్ ఫోన్లు లేవు. ల్యాండ్‌లైను ఫోను ఉన్న వాళ్లూ తక్కువే. సోషల్ మీడియా లేదు. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే ఇప్పటి స్థాయిలో విస్తృత ప్రజానిఘా లేని ఆనాటి పరిస్థితిలో 2002 నాటి సర్‌కు చాలా పరిమితులు ఉంటాయి. పేర్లలో, ఇంటి పేర్లలో, వయస్సుల నమోదులో ఎన్నో తప్పులు ఆనాటి జాబితాలో కనపడతాయి. వీటన్నిటినీ సరిదిద్దుకోవాల్సిన బాధ్యతను ఇప్పుడు ఓటర్లపైనే పెట్టారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదుచేయటం రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ విధి. అలా నమోదుచేసిన వాళ్లను కొన్నేళ్ల తర్వాత 'మిమ్మల్ని మీరు ఓటర్లుగా నిరూపించుకోండి' అని చివరికి అదే కమిషన్ ఆదేశించటం ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పలుచన చేయటమేనని ఇప్పటికే ఎన్నో విమర్శలు వచ్చాయి.

గ్రామాల్లో చనిపోయిన వారి సమాచారం స్థానిక పంచాయతీ సిబ్బంది దగ్గర ఉంటుంది. కనీసం దాని ఆధారంగా ప్రతిఏటా జరిగే ఓటర్ల సవరణ ప్రక్రియలో వాళ్ల పేర్లను తేలికగానే తొలగించవచ్చు. అది కూడా చేయలేని అసమర్థతను ఎన్నికల కమిషన్ యంత్రాంగం ప్రదర్శించింది. ఇటీవల సర్ చేపట్టిన రాష్ట్రాల్లో ఒక్క బెంగాల్ మినహా మిగతా చోట్ల ఎంతమంది చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారో స్పష్టంగా పేర్కొనలేదు. బెంగాల్‌లో 91 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. అందులో మరణించిన వారి పేర్లు 58.08 లక్షలు ఉన్నాయి. ఏటా ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరిగితే ఒక్కసారిగా ఇన్నిపేర్లను తొలగించాల్సిన అవసరం ఉండదు. అన్ని రాష్ట్రాల్లో సర్ పూర్తయితే ఎంతమంది ఓటర్ల జాబితా నుంచి తొలగిపోతారన్నది ఇంకా స్పష్టం కాలేదు. మొత్తంగా ఈ సంఖ్య 10 కోట్లు దాటుతుందనే అంచనాలు ఉన్నాయి. సర్ పూర్తయిన చోట ఇప్పటివరకూ 5 కోట్లకు పైబడి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. తుది లెక్కలు తేలేసరికి దాదాపుగా 10శాతానికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉంది. ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ ఇంతస్థాయిలో ఇలా తొలగింపులు జరగలేదన్న విమర్శను తేలికగా కొట్టేయలేం. చనిపోయిన వాళ్లను, ఒకటికి మించి పలుచోట్ల ఓటర్లుగా ఉన్న వాళ్లను జాబితా నుంచి తొలగించటానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే వెసులుబాట్లను కనుక్కోకుండా మీరు పౌరులో కాదో నిరూపించుకోండని అందరినీ కోరటం నిర్హేతుకంగానే ఉంటుంది.

ఎన్నికలు ముంగిట్లోలేని రాష్ట్రాల్లో సర్ తొలగింపులతో నష్టం తక్కువగానే ఉండొచ్చు. తక్షణ రాజకీయ అవసరాలు ఉన్నచోట పరిస్థితి వేరుగా ఉంటుందన్నదానికి బిహార్, బెంగాల్ ఎన్నికలప్పుడు చెలరేగిన వివాదాలే నిదర్శనం. సర్‌తో ఓట్లు తొలగిన తర్వాత మళ్లీ జాబితాలో కొత్త ఓటరుగా నమోదు కావటానికి అవకాశం ఉంటుందని అధికారులు ఒకటికి పదిసార్లు చెప్పారు. నిబంధనలు అందుకు అనుకూలంగా ఉన్నాయనీ స్పష్టంచేశారు. కానీ, రోజులు గడవకుండానే మెలికపెట్టారు. దీనినీ సర్‌తో ముడిపెట్టారు. మొత్తంగా 'సర్'తో ఎన్నికల కమిషన్ నిష్పక్షపాత పాత్రపై నమ్మకం పలచబడిపోయింది. మళ్లీ దాన్ని బలోపేతం చేసుకుంటేనే ఎన్నికల కమిషన్ పాత్రకు సార్థకత చేకూరుతుంది. భవిష్యత్తులో ఇదే తరహా సర్‌లు పునరావృతమైతే కమిషన్ సమర్థతపైనే సందేహాలు అలుముకుంటాయి. పాస్‌పోర్టు కూడా భారత పౌరసత్వానికి చిహ్నం కాదన్న విచిత్రవాదనతో అంతర్జాతీయంగా పరువుపోయింది. సర్ పేరుతో ఇంత జరిగిన తర్వాత కూడా భవిష్యత్తులో ఓటరు కార్డులకు ప్రామాణికత ఉండదనే వాదనను మళ్లీ చేస్తే ఎన్నికల కమిషన్ తన ప్రతిష్ఠను నిలబెట్టుకోవటం కష్టం! ఓటరు కార్డులున్న వారందరినీ పౌరులుగా భావించలేమన్న వాదనను ఎల్లకాలం కొనసాగించితే అది మన ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ!

# నేరగ్రస్త రాజకీయాల ప్రక్షాళనకు

**తెలిసి తెలిసి దొంగ చేతికి తాళాలు ఇచ్చాక- డబ్బూదస్కం, నగానట్రా అన్నీ పోయాయని ఎంత ఏడిస్తే ఏం లాభం? అలాగే, చూస్తూ చూస్తూ నేరచరితులైన నేతలకు పదవులు అప్పగించి, ఆ తరవాత వాళ్లంతా కలిసి దోచుకుతింటున్నారని, ప్రజాప్రయోజనాలకు పాతరేస్తున్నారని ఎన్ని విమర్శలు చేస్తే మాత్రం ఏంటి ప్రయోజనం? చట్టాలను ఉల్లంఘించేవారు చట్టసభల్లోకి అడుగుపెట్టనేకూడదని సుప్రీంకోర్టు ఇరవై ఏళ్ల క్రితమే ఉద్ఘాటించింది. నేరచరిత్ర కలిగిన నాయకులు ఎన్నికల ప్రక్రియను కలుషితం చేస్తారని ఆందోళన వ్యక్తంచేసింది. కానీ, ఎలాగైనా ఎలక్షన్లలో గెలవాలనుకునే రాజకీయ పార్టీల పుణ్యమా అని భారత ప్రజాస్వామ్యం నేడు నేరగ్రస్త రాజకీయాల విషకౌగిలిలో చిక్కుకుపోయింది. ఏడీఆర్ నివేదికల ప్రకారం, 2009 లోక్‌సభ ఎన్నికల్లో నేరారోపణలను నెత్తినమోస్తున్న 162 మంది ఎంపీలయ్యారు. 2024కు వచ్చేసరికి అటువంటి వారు 251కి పెరిగారు. కిందటి నెల నాటికి 226 మంది రాజ్యసభ సిట్టింగ్ ఎంపీల్లో 31శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 28 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 4092 మంది ఎమ్మెల్యేల్లో 45శాతం మందికి నేరచరిత్ర ఉన్నట్లు ఏడీఆర్ నిరుటి అధ్యయనాంశాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది కేరళ అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన వారిలో 84శాతం మంది రకరకాల కేసుల్లో నిందితులైతే- పశ్చిమబెంగాల్ నూతన ఎమ్మెల్యేల్లో 65శాతం, తమిళనాడు శాసనసభ్యుల్లో 54శాతం మందిదీ అదే బాపతు నేపథ్యం! విచారణల్లో సుదీర్ఘ జాప్యం, శిక్షలు అరుదుగా పడుతుండటం వల్ల అభియోగాలు రుజువైన వారిపైనే అనర్హత వేటువేసే విధానం నేరమయ రాజకీయాల ప్రక్షాళనకు పనికిరావట్లేదన్నది లా కమిషన్ సైతం తేల్చిచెప్పిన చేదునిజం!**

ప్రధానమంత్రి నుంచి రాష్ట్రాల మంత్రుల వరకు ఎవరైనా తీవ్ర నేరాభియోగాలపై అరెస్టు అయ్యి, వరుసగా 30రోజులకు మించి నిర్బంధంలో ఉన్నపక్షంలో వారిని పదవుల్లోంచి తప్పించాలని కేంద్రం నిరుడు ప్రతిపాదించింది. ఆ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలించిన పార్లమెంటరీ కమిటీ ఎల్లుండి తన నివేదికను సమర్పించబోతున్నట్లుగా తెలుస్తోంది. నిర్దేశిత కాలం జైల్లో ఉన్న వ్యక్తులను మంత్రి పదవుల్లోంచి తొలగించడమే తప్ప వారి చట్టసభ సభ్యత్వాలను రద్దు చేయడానికి ఉద్దేశించిన బిల్లు కాదు కాబట్టి దీనివల్ల ప్రభుత్వాల మనుగడకు ఎలాంటి ముప్పు ఉండదని అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ, కేవలం పోలీసు రిపోర్టులను ఆధారం చేసుకునే అనర్హతను వర్తింపజేయలేమని లా కమిషన్ 2014లోనే స్పష్టీకరించింది. అయిదేళ్లకు మించి శిక్షపడే కేసుల్లో నేరాభియోగాల నమోదు దశలో సునిశిత న్యాయసమీక్ష అనంతరం సంబంధిత నేతలను అనర్హులుగా ప్రకటించవచ్చనని కమిషన్ అప్పట్లో సూచించింది. దీన్ని ఎవరూ దుర్వినియోగం చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ లా కమిషన్ తన నివేదికలో క్రోడీకరించింది. సహేతుకమైన ఆ సిఫార్సులను అమలుచేస్తేనే క్రిమినల్ నాయకుల కబంధ హస్తాల్లోంచి జనభారతానికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది!

కిందటేడాది జనవరి ఒకటో తేదీనాటికి దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై 4732 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ, 20132025 మధ్యలో నేరాలు రుజువై సిట్టింగ్ ఎంపీలూ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడిన సందర్భాలు 27గానే లెక్కతేలుతున్నాయి. జాతి వనరులను స్వాహాచేసిన తీవ్ర ఆర్థిక నేరాలకు సంబంధించిన 11 సీబీఐ కేసులు, 9 ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వై.ఎస్.జగన్ దాదాపుగా 13 ఏళ్లుగా బెయిల్‌పై స్వేచ్ఛా జీవితం గడుపుతున్నారు. నేర రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనాలుగా పరువుమాసిన ఇటువంటివారు అధికార పీఠాలను అధిష్ఠించి జనాన్ని కాల్చుకు తినకూడదంటే ప్రజాప్రతినిధులపై నమోదైన కేసులను వేగంగా విచారించాలి. నేరగాళ్లుగా తేలిన తాలునేతలను ప్రజాజీవితంలోంచి శాశ్వతంగా వెలేయాలి!

# బ్రిటిష్ విపణిలో జెండా పాతాలంటే..

**నేటి నుంచి అమలులోకి వస్తున్న భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) మన ఎగుమతిదారులకు కొత్త అవకాశాలను కల్పిస్తోంది. వివిధ రంగాల్లో వివిధ రకాలుగా ఉండే వీటిని అందిపుచ్చుకోవడానికి సమగ్ర వ్యూహం పాటించాలి. కార్మికులను పెద్ద సంఖ్యలో నియమించి తయారుచేసే వస్తువులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, సముద్ర ఆహారం, ఆటోమొబైల్స్, కొన్ని పారిశ్రామిక ఉత్పత్తులను బ్రిటన్‌కు పెద్దఎత్తున ఎగుమతి చేయడానికి 'సెటా' వీలు కల్పిస్తుంది.**

నిరుడు బ్రిటన్ 92,890 కోట్ల డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది. వాటిలో భారత్ నుంచి వెళ్లిన వస్తువుల విలువ కేవలం 1,520 కోట్ల డాలర్లే. ఈ వాటాను పెంచుకోవడానికి 'సెటా' సాయపడుతుంది. ఈ ఒప్పందం కింద బ్రిటన్‌లో బాగా గిరాకీ ఉన్న కొన్ని రంగాల్లో భారత ఎగుమతుల వృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయి. భారతదేశం 2025లో ప్రపంచ దేశాలకు 1,630 కోట్ల డాలర్ల విలువైన దుస్తులను ఎగుమతి చేసింది. అదే సంవత్సరం బ్రిటన్ మిగతా దేశాల నుంచి దిగుమతి చేసుకున్న దుస్తుల విలువ 2,130 కోట్ల డాలర్లు. వాటిలో భారతదేశం నుంచి వెళ్లిన వస్త్రాల విలువ 130 కోట్ల డాలర్లు మాత్రమే. 'సెటా' వల్ల భారతీయ దుస్తుల దిగుమతులపై సుంకాలు తగ్గుతాయి కాబట్టి, ఈ అవకాశాన్ని మన పరిశ్రమలు ఉపయోగించుకోవాలి. 'సెటా' కింద సుంకాలు తగ్గే తోలు వస్తువులు, పాదరక్షల ఎగుమతి వృద్ధికీ బాగా అవకాశాలున్నాయి.

**కొన్నింట్లో అధికం... మరికొన్నింట్లో మధ్యస్థం!**

గడచిన సంవత్సరంలో బ్రిటన్ దిగుమతి చేసుకున్న ప్రాసెస్ చేసిన ఆహారం విలువ 3,340 కోట్ల డాలర్లు కాగా, అందులో భారత్ వాటా 35.4 కోట్ల డాలర్లే. బ్రిటన్‌కు రెడీ టూ ఈట్ ఆహారాలు, బేకరీ, మిఠాయి ఉత్పత్తులు, సాస్‌లు, భారతీయ వంటకాల ఎగుమతులను పెంచడానికి గొప్ప అవకాశాలున్నాయి. 2025లో భారత్ ప్రపంచదేశాలకు 2,560 కోట్ల డాలర్ల విలువైన ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసింది. సరిగ్గా ఇదే కాలంలో బ్రిటన్ 2,320 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులు చేసుకుంది. అందులో భారత్ వాటా కేవలం 3.1 శాతం. 'సెటా' చలవతో దీన్ని బాగా పెంచవచ్చు. నిరుడు భారత్ అన్ని దేశాలకు ఎగుమతి చేసిన చేపలు, మాంసం, ప్రాసెస్డ్ మాంసాహారాల విలువ 1280 కోట్ల డాలర్లు. అదే సంవత్సరం బ్రిటన్ 1720 కోట్ల డాలర్ల విలువైన మాంసాహారాన్ని విదేశాల నుంచి తెప్పించుకుంది. ఆ దిగుమతుల్లో భారత్ నుంచి వచ్చినవాటి విలువ 12.6 కోట్ల డాలర్లు మాత్రమే. బ్రిటన్ ఆహార ప్రమాణాలను పాటించి మన ఎగుమతులను పెంచుకోవచ్చు. ఆటోమొబైల్స్, మోటార్‌సైకిళ్లు, వాటి విడిభాగాలనూ పెద్ద సంఖ్యలో బ్రిటన్‌కు పంపవచ్చు. బ్రిటన్ దిగుమతి చేసుకున్న ఈ తరహా వస్తువుల విలువ 9,220 కోట్ల డాలర్లు కాగా, వాటిలో భారత్ ఎగుమతుల విలువ 32.5 కోట్ల డాలర్లే. 'సెటా' కింద సుంకాల తగ్గింపుతో ఈ రంగంలోనూ భారతీయ ఎగుమతిదారులకు చక్కటి అవకాశాలు లభిస్తాయి. యంత్రాలు, టెలికాం, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకూ 'సెటా' ఊతమిస్తుంది. ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యమిస్తూ తిరుగులేని నాణ్యతా ప్రమాణాలను పాటిస్తేనే ఎగుమతుల్లో భారత్‌కు లబ్ధి కలుగుతుంది.

రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ రంగంలో భారత్‌కు బలమైన సరఫరా సామర్థ్యం ఉన్నప్పటికీ, 'సెటా' ద్వారా లభించే అవకాశాలు పరిమితం. బ్రిటన్ ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తుల దిగుమతుల్లో భారత్ వాటా స్వల్పమే. సుంకాల తగ్గింపు కొన్ని వస్తువుల ఎగుమతికి తోడ్పడినా పర్యావరణ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలు, బలమైన పోటీ వల్ల లాభాలు తక్కువగా ఉంటాయి. 2025లో బ్రిటన్ ప్రపంచ దేశాల నుంచి 17,850 కోట్ల విలువైన వజ్రాలు, బంగారం, వెండి ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. వీటిలో భారత్ నుంచి వంద కోట్ల డాలర్ల విలువైనవి మాత్రమే దిగుమతి అయ్యాయి. లండన్ అంతర్జాతీయ బులియన్ మార్కెట్ కాబట్టి, ఇక్కడ నెగ్గుకురావడం భారత్‌కు సులువు కాదు. కాగితం, కొయ్య ఉత్పత్తులు, రైల్వేవిమాననౌకా ఉత్పత్తులు, కృత్రిమ పూలు, గొడుగులు, వంట నూనెలు కూడా మధ్యస్థ అవకాశాల విభాగంలోకి వస్తాయి. రవాణా ఖర్చులు, పర్యావరణ నిబంధనలు, తీవ్రమైన పోటీ, విదేశాలకు పంపేందుకు భారత్‌కు మిగులు పరిమితంగా ఉండటం తదితరాల వల్ల ఈ వస్తు ఎగుమతుల్లో లాభాలు తక్కువగా ఉంటాయి.

**మెరుగ్గా సిద్ధం కావాలి!**

ఇనుము, ఉక్కు ఉత్పత్తులకు సంబంధించి బ్రిటన్ విధించే కఠిన నిబంధనలు, తగ్గిన కోటాలు, అధిక సుంకాలు 'సెటా'కు అడ్డురావచ్చు. మద్యం, పొగాకు ఉత్పత్తుల ఎగుమతులకూ అవకాశాలు తక్కువే. మద్యం విషయంలో బలమైన పోటీ, సిగరెట్లు వంటి వాటిలో అధిక ఎక్సైజ్ పన్నులు, కఠినమైన ఆరోగ్య నిబంధనలు ఇందుకు కారణాలు. భారత్‌కు కొన్ని వస్తువులలో బలమైన ఎగుమతి సామర్థ్యం ఉంటేబ్రిటన్‌లో వాటికి గణనీయమైన గిరాకీ నెలకొంది. 'సెటా'తో సుంకాల ప్రతికూలతలు తప్పిపోతాయి కాబట్టి దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దుస్తులు, తోలు, పాదరక్షలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, సముద్ర ఆహారం, ఎంపిక చేసిన వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ఇది స్పష్టంగా లాభిస్తుంది. ఆటోమొబైల్స్ దీర్ఘకాలికంగా మంచి అవకాశాన్ని అందిస్తాయి. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు కూడా బలంగా వృద్ధి చెందగలవు. కానీ, ఈ రంగాల్లో విజయం సుంకాల తగ్గింపు కంటే నాణ్యతా ప్రమాణాల పైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల భారత్‌కు రంగాల వారీగా ఎగుమతి వ్యూహం అవసరం. ఆహార ఎగుమతిదారులు బ్రిటిష్ శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలను పాటించడం తప్పనిసరి. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలకు ధృవీకరణ, నవీన సాంకేతికత, బలమైన కొనుగోలుదారుల సంబంధాలు కావాలి. ఆటోమొబైల్ ఎగుమతిదారులు వస్తూత్పత్తి ప్రదేశాన్ని నిర్ధారించే నిబంధనలను పాటించాలి.

# ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు

- ప్రతి ఫిర్యాదును గడువులోగా పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ అంకిత్ స్పష్టం



**కొత్తగూడెం, జూలై 27 అనంత జనశక్తి :**

ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని నిర్దేశిత గడువు లోగా పరిష్కరించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భూ వివాదాలు, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలకు సంబంధించిన వినతులను పరిశీలించిన కలెక్టర్, వాటిని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పూర్తిచేయాలని, మిగిలిన వాటిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో జూలూరుపాడు మండలానికి చెందిన యువతి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని చేసిన విజ్ఞప్తి, కొత్తగూడెం వాసి పట్టాదారు పాస్‌పుస్తకం జారీ, ఇల్లందు మండలానికి చెందిన మహిళ రైతు భరోసా వర్తింపజేయాలన్న అభ్యర్థన, అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన మహిళ ఇందిరమ్మ ఇంటి కేటాయింపు, అశ్వరావుపేట మండలానికి చెందిన రైతు పట్టాదారు పాస్‌పుస్తకం సమస్యపై వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని, ప్రతి వినతిపై అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించి ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణపై ఉక్కుపాదం

- ఎన్‌డీపీఎస్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలి
- పరారీలో ఉన్న నిందితుల అరెస్టుకు ప్రత్యేక బృందాలు

**కొత్తగూడెం, జూలై 27 (అనంత జనశక్తి ) :**

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు మరింత కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పకడ్బందీగా సాక్ష్యాధారాలు సేకరించి త్వరితగతిన చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావివ్వొద్దని, పరారీలో ఉన్న నిందితులను ప్రత్యేక బృందాలతో గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారుల ఆర్థిక లావాదేవీలు, అక్రమ ఆస్తులపై సమగ్ర దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్‌తో పాటు డీఅడిక్షన్ కేంద్రాలకు పంపే ప్రక్రియను సమర్థంగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్, సబ్‌డివిజన్ పరిధిలో డీఅడిక్షన్ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సమావేశంలో జిల్లా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రారంభమైన "గోకులం" చిత్రం



- ముహూర్తపు షాట్‌తో ప్రారంభమైన చిత్రీకరణ...
- చిత్రబృందానికి మాజీ లోకాయుక్త జస్టిస్ సి.వి. రాములు శుభాకాంక్షలు...

**ధర్మవరం, జూలై 27, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలో సోమవారం సినీ సందడితో కళకళలాడింది. మైథాలజీ, జానపదం, టైమ్ ట్రావెల్ అంశాలను సమన్వయం చేస్తూ వినూత్న కథాంశంతో రూపొందుతున్న "గోకులం" చిత్రం ముహూర్తపు షాట్‌తో ఘనంగా ప్రారంభమైంది. చిత్రీకరణ ప్రారంభోత్సవ వేడుకకు సినీ, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ లోకాయుక్త జస్టిస్ సి.వి. రాములు పాత్రికేయులకు అందించిన సందేశంలో చిత్రబృందాన్ని అభినందిస్తూ, సినిమా అనేది కేవలం వినోద మాధ్యమం మాత్రమే కాదని, సమాజాన్ని ఆలోచింపజేసే గొప్ప సృజనాత్మక శక్తి అని పేర్కొన్నారు.

"కాలాన్ని జయించేది శక్తి కాదు సృజన మాత్రమే. తరాలు మారినా నిలిచిపోయేది ఆలోచనే
ఆ ఆలోచనకు రూపమే గొప్ప సినిమా" అని ఆయన పేర్కొన్నారు.

మైథాలజీ, జానపదం, టైమ్ ట్రావెల్ వంటి విభిన్న కథా ప్రపంచాలను ఒకే దృశ్యకావ్యంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ప్రయత్నం ఎంతో సాహసోపేతమైందని కొనియాడారు. సాధారణ కథను చెప్పడం ఒక కళ అయితే, గతం వర్తమానం భవిష్యత్తును ఒకే కథలో మేళవించి కాలాన్నే కథానాయకుడిగా మలచడం అసాధారణ సృజనాత్మకతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

దర్శకుడు ప్రదీప్ వినూత్న ఆలోచనతో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అభినందనీయమని, తెలుగు సినీ పరిశ్రమకు మరో విలువైన చిత్రాన్ని అందించాలనే ఆయన సంకల్పం ప్రశంసనీయమని తెలిపారు.

అలాగే, ఒక గొప్ప సినిమా వెనుక కళాకారుల శ్రమతో పాటు ఎన్నో కలలు, త్యాగాలు, పరిశోధన, ప్రణాళిక, నమ్మకం దాగి ఉంటాయని పేర్కొన్నారు. అలాంటి సృజనాత్మక ప్రయాణాన్ని విశ్వసించి నిర్మాణ బాధ్యతలను చేపట్టిన నిర్మాత ప్రత్యేక అభినందనలకు అర్హులని అన్నారు. సృజనను విశ్వసించి పెట్టుబడి పెట్టే నిర్మాతలే గొప్ప చిత్రాలకు బలమైన పునాదిగా నిలుస్తారని చెప్పారు.

చిత్రానికి కథ అందించిన నరసింహారెడ్డిని ప్రత్యేకంగా అభినందించిన జస్టిస్ రాములు, బలమైన కథ, దూరదృష్టి గల దర్శకత్వం, నిబద్ధతతో కూడిన నిర్మాణం కలిసొస్తేనే ఒక చిత్రం ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

తెలుగు సినిమా ప్రపంచవ్యాప్తంగా తన ప్రత్యేక గుర్తింపును చాటుకుంటున్న ప్రస్తుత తరుణంలో, కొత్త ఆలోచనలు, వినూత్న కథాంశాలు, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందే చిత్రాలు పరిశ్రమ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు. "గోకులం" కూడా అలాంటి చిత్రాల సరసన నిలిచి తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

చిత్రం ప్రేక్షకులకు వినోదంతో పాటు ఆలోచనను రేకెత్తించే అనుభూతిని అందించి, విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. దర్శకుడు ప్రదీప్, నిర్మాత, కథా రచయిత నరసింహారెడ్డి, నటీనటులు, సాంకేతిక నిపుణులు, మొత్తం చిత్రబృందానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ధర్మవరం నుంచి ప్రారంభమైన ఈ సినీ ప్రయాణం తెలుగు సినీ పరిశ్రమలో చిరస్మరణీయ విజయంగా నిలిచి, సృజనాత్మక చిత్రాలకు సరికొత్త ప్రమాణంగా అవతరించాలని ఆకాంక్షించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల వేళ ముదిగుబ్బ మండలంలో వైసిపికి షాక్



- మర్తాడు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు టిడిపిలోకి చేరికలు
- ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో చేరికలు
- రెండేళ్ల పాలనలో జరిగిన కార్యక్రమాలు చూసి పార్టీలోకి వస్తున్నారన్న శ్రీరామ్

**ధర్మవరం జూలై 27 అనంత జనశక్తి న్యూస్**

స్థానిక సంస్థల ఎన్నికల వేళ ధర్మవరం నియోజకవర్గం, ముదిగుబ్బ మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మర్తాడు పంచాయతీ ఎస్.బండ్లపల్లికి చెందిన పలువురు వైసిపి నాయకులు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన జె.నారాయణస్వామి, జే.ఆదినారాయణ, పి.ఆది నారాయణ, చిన్న నారాయణ, నడిపి నారాయణ, జే.అదెప్ప, పి.నారాయణస్వామితో పాటు మొత్తం 38 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో శ్రీరామ్ వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మనోహర్, ఎస్.బండ్లపల్లి గ్రామ స్థానిక నాయకులు అంకె కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి వచ్చినట్లు నాయకులు తెలిపారు. పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కోసం ఇక నుంచి కష్టపడి పని చేస్తామని వారు తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో సొంత పార్టీ నాయకులకు కూడా న్యాయం జరిగిన పరిస్థితి లేదన్నారు. అందుకే చాలామంది నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యత ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.....

# ఆకివీడులో రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

ఈ వివాదానికి సంబంధించి.. గతంలో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిరభ్యంతర పత్రం చట్టబద్ధమైనదేనని సుప్రీం కోర్టు పేర్కొంది. ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు లోబడి ఆలయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి తప్పులేదని వెల్లడించింది. ఆలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లో ఎటువంటి సత్యాలు లేవని కోర్టు పేర్కొంది. పిటిషన్‌ను తోసిపుచ్చింది. కలెక్టర్ ఇచ్చిన ఎన్‌ఓసీ సరైనదేనని, దానిలో ఎలాంటి చట్ట ఉల్లంఘన జరగలేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో రామాలయాన్ని నిర్మించడంలో ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టు వెల్లడించింది. సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆకివీడులో రామాలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యాయస్థానం తీర్పుతో స్థానిక ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సుప్రీం కోర్టు తీర్పుపై సంతోషం వ్యక్తం చేశారు.

'ఆకివీడులో రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్! రామాలయ నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది! సత్యం గెలిచింది! ధర్మం గెలిచింది! శ్రీ రాముడు గెలిచాడు!! జై శ్రీ రామ్!' అని రఘురామ కృష్ణ రాజు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## నేడు పినపాక నియోజకవర్గ

# సీపీఐ సమావేశం

- ప్రజా చైతన్య యాత్రపై కార్యాచరణ ఖరారు
- పార్టీ శ్రేణులు తప్పనిసరిగా హాజరు కావాలి

**మణుగూరు, జూలై 27 (అనంత జనశక్తి) :**



సీపీఐ పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మణుగూరులోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా హాజరుకానున్నారని చెప్పారు. సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని మండల, పట్టణ కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, సహాయ కార్యదర్శులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ, మహిళా, గిరిజన, యువజన, ప్రజా సంఘాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, శాఖ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో అయోధ్య స్మారక స్తూపం ఆవిష్కరణ, సీపీఐ ప్రజా చైతన్య యాత్ర తదితర అంశాలపై చర్చించి కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ఉద్యాన పంటల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



- రైతులు ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందాలి: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**కదిరి , జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వ్యవసాయం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.కదిరి రూరల్ మండలం ఎగువపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువపల్లి గ్రామంలో వికసిత్ భారత్ – ఉపాధి, జీవనోపాధి హామీ (గ్రామీణ) కార్యక్రమంలో భాగంగా రైతు సుధాకర్ నాయుడు పొలంలో నిర్వహించిన ఉద్యాన పండ్ల తోటల మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండ్ల తోటల విస్తరణ, ఆధునిక సాగు పద్ధతులు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని రైతులకు సూచించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధికి పలు కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చెంచయ్య నాయుడు, ఉద్యానవన శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 2ఏళ్ల నమ్మకం - అభివృద్ధి – సంక్షేమం



- రెండేళ్ల సుపరిపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం
- ఇంటింటి ప్రచార కార్యక్రమము

**అగళి జూలై 27,అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వారి ఆదేశాల మేరకు మడకశిర నియోజకవర్గంలోని అగళి మండలంలో హళ్లికేరా పంచాయతీలోని హళ్లికేరా, హళ్లికేరా గొల్లహట్టి, ముతేపల్లి గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పీటీసీ వి ఉమేష్, మండల అధ్యక్షులు తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షుడు కుమారస్వామి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ మూర్తి, కొ కన్వీనర్ కమ్మరి శివన్న, మాజీ ఎంపిపి బసవరాజు, మాజీ ఎంపిపి ఇనగలూరు నరసింహప్ప, మాజీ మండల ప్రధాన కార్యదర్శి జయరాం, మండల ప్రధాన కార్యదర్శి డి.విశ్వనాథ్ యాదవ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కేంచుయాదవ్, తెదేప నాయకులు గురుమూర్తి, హళ్ళికేర రామన్న, వేణుగోపాల్, నింగరాజు స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మరియు ప్రజా ప్రయోజన కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణి చేసి ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, వారి సమస్యలను వినిపించుకుని, పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల ఆదరణ మధ్య కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందన్నారు.



## ఈనెల 29న బుద్ధవనములో ధర్మ చక్ర ప్రవర్తన దినోత్సవం

**- బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య**

**నాగార్జునసాగర్,జూలై,27 అనంత జనశక్తి న్యూస్**

మహాయాన బౌద్ధ వారసత్వ సంపద నిలయమైన బుద్ధ వనములో ఈ నెల 29న ధర్మ చక్ర ప్రవర్తన దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం జ్ఞానోదయం అయిన తర్వాత బుద్ధునిగా తన సహచరులైన కొౌండన్న,మహానామ, వప్ప,బద్దియ,అస్సాజీ మొదలగు ఐదు మంది శిష్యులకు మొదటిసారి తాను తెలుసుకున్న జ్ఞానం గురించి సారనాథ్ లోని మృగధావనములో ఉపన్యసించిన రోజున ధర్మచక్ర ప్రవర్తన దినోత్సవం గా ప్రతి ఏటా ఆషాడ పూర్ణిమ రోజు జరుపుకుంటారు. బుద్ధవనములో జూలై,29 బుధవారం రోజున ఉదయం 11 గంటల నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమాలకు ఢిల్లీకి చెందిన ప్రముఖ ప్రొఫెసర్ అలోనీ హాజరై ఉపన్యసించనున్నట్లుగా తెలిపారు.బుద్ధ వనములో నిర్వహించే దమ్మచక్ర ప్రవర్తన వేడుకలకు బౌద్ధాభిమానులు,స్థానికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## తాడిచెర్ల-2 ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి



**- స్థానికులకు 1,000 ఉద్యోగాలు – సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీసం ₹10 వేల పెన్షన్ కల్పించాలని కేంద్రాన్ని కోరిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి**

**న్యూఢిల్లీ, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, తెలంగాణ రాష్ట్ర గనులు మరియు కార్మిక శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామితో కలిసి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి అత్యంత కీలకమైన తాడిచెర్ల 2 బొగ్గు గని ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని, ముఖ్యంగా ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల యువతకు ఉపాధిలో ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పునరుద్ధరణ పథకం కింద సమగ్ర సౌకర్యాలు కల్పించాలని కోరారు.సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీస నెలవారీ పెన్షన్ ₹10,000 అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తక్కువ పెన్షన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది రిటైర్డ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు.అదేవిధంగా సింగరేణి సంస్థ అభివృద్ధి, బొగ్గు గనుల విస్తరణ, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్ర సహకారంతో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర మంత్రితో విస్తృతంగా చర్చించారు.ఈ అంశాలపై స్పందించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, తాడిచెర్ల 2 ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడం, స్థానిక యువతకు ఉద్యోగాల కల్పన, పునరావాస పథకం సమర్థ అమలు, అలాగే సింగరేణి పదవీ విరమణ పొందిన కార్మికుల పెన్షన్ అంశాన్ని సంబంధిత శాఖలతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఏజెన్సీలో ఇసుక ర్యాంపులపై తుడుందెబ్బ ఆగ్రహం

**- చట్టాలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**- గిరిజన హక్కులు, ప్రకృతి సంపదను కాపాడాలని హెచ్చరిక**

**జానంపేట, జూలై 27 (అనంత జనశక్తి)**

: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేటలో ఇసుక ర్యాంపుల నిర్వహణపై ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెంకోటి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ఇసుక ర్యాంపులు నిర్వహించేందుకు అనుమతులు ఎలా ఇచ్చారో ప్రభుత్వం, సంబంధిత అధికారులను ప్రశ్నించారు. టీజీఎండీసీ, గనుల శాఖ అధికారులు చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాలా మార్పిడి (కన్వర్షన్) చేయని భూములను, ఇతరుల భూములను ఇసుక డంపింగ్ యార్డులుగా అనుమతించడం, వాణిజ్య భూములకు రైతుబంధు ప్రయోజనాలు వర్తింపజేయడం వంటి అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు వ్యాపార అనుమతులు ఇవ్వడం, అటవీ శాఖ రహదారుల కోసం గ్రావెల్ తవ్వకాలు, గోదావరిలో మట్టి తరలింపునకు అనుమతులు మంజూరు చేయడం చట్టవిరుద్ధమని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత కాంట్రాక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి, గిరిజనుల హక్కులు, ప్రకృతి సంపదను పరిరక్షించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని, అందుకు ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అలెంకోటి హెచ్చరించారు.



# ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం స్పందించాలి

**- ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి**

**- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రహ్మారెడ్డి**

**నాగార్జున సాగర్ జులై 27 అనంత జనశక్తి న్యూస్**



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం (TUF) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణ బ్రహ్మానందరెడ్డి అన్నారు, సోమవారం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో పర్యటించిన ఆయన,ముందుగా జిల్లా కమిటీ,నాగార్జునసాగర్ కమిటీ, జర్నలిస్ట్ ఫోరం సభ్యులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు,అనంతరం నాగార్జునసాగర్ లోని తన నివాసంలో స్థానిక ఉద్యమకారుల తో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు,ఈ సందర్భం గా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల ఆశయాలను సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలి ఇప్పటికే పలువురు ఉద్యమకారులు మరణించగా అనారోగ్యం తో ఉద్యమ కారుల జీవితాలు కోల్పోతున్నారు,ఇప్ప టికైనా ప్రభుత్వం గుర్తించి,అర్హులైన ఉద్యమకారులందరికీ తగిన గుర్తింపు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు

అనంతరం రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యులు సిరికొండ మధు,జిల్లా కార్యదర్శి చెంగలి జంగన్న,మాట్లాడుతూ ఉద్యమకారు లకు ఇచ్చిన హామీలన్నింటినీ ఉద్యమకారు లందరికీ తక్షణమే అమలు చేయాలి 250 గజాల ఇంటి స్థలం,25 వేల పెన్షన్,మరియు మెరుగైన వైద్యం కోసం హెల్త్ కార్డులు,బస్సు సదుపాయం రాష్ట్రవ్యాప్తంగా,అలాగే ట్రైన్ సదుపాయం అందించాలని కోరారు. అనంత రం జిల్లా ఉపాధ్యక్షుడు,జర్నలిస్టు ఫోరం జిల్లా నాయకులు ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన ఇతర హామీలను కూడా తక్షణమే అమలు చేయాలని,అలాగే ఎలక్షన్ల సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఉద్యమకారుల గుర్తింపు కార్డులు కూడా కమిటీ ద్వారా తక్షణమే అందించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిటీకి సూచించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దవూర మండల అధ్యక్షు లు చెరుకుపల్లి వాసు,ప్రధాన కార్యదర్శి ఊర శ్రీను,నందికొండ పట్టణ ప్రధాన కార్యదర్శి బూసరాజుల కృష్ణయ్య,నాయకులు చంద్రయ్య,జర్నలిస్ట్ ఫోరం నాయకులు కోడా అప్పారావు, యోబు రాజు,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో ఏటీసీలు, నైపుణ్యాభివృద్ధి

# కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం సహకారం

**– కేంద్ర మంత్రి జయంత్ చౌదరితో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి భేటీ**

**న్యూఢిల్లీ, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**



పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల విస్తరణ, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీలు) ఏర్పాటు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ కల్పించే అంశాలపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, తెలంగాణ రాష్ట్ర గనులు మరియు కార్మిక శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏటీసీలు ఏర్పాటు చేయడం, ఐటీఐలను బలోపేతం చేయడం, కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి పథకాలను సమర్థంగా అమలు చేయడం, యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ అందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు.శిక్షణ పూర్తిచేసిన యువతకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి కోరారు. అలాగే స్కిల్ ఇండియా కార్యక్రమం కింద మరిన్ని శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ధ్రువీకరణ పత్రాలు, ఉద్యోగ అవకాశాలను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి జయంత్ చౌదరి, సంబంధిత ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, ఏటీసీల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల విస్తరణ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఓటు హక్కు కోల్పోతే పౌరసత్వమే ప్రశ్నార్థకం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**– ఓటర్ల జాబితా సవరణలో కాంగ్రెస్ బీఎల్ఏల సేవలు ప్రశంసనీయం**

**మధిర, జూలై 27:అనంత జనశక్తి న్యూస్**



భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడమే ప్రజాస్వామ్యానికి పునాదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మధిర నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), వారి కుటుంబ సభ్యులతో మాటూరుపేటలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేశారని ఆయన అభినందించారు. దేశవ్యాప్తంగా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన ఓటర్ల పేర్లను కృత్రిమ మేధ సాంకేతికత ద్వారా గుర్తించి తొలగించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యల ద్వారా బీజేపీ రాజకీయ ప్రయోజనం పొందిందని విమర్శించారు.ఓటు హక్కు కోల్పోతే భవిష్యత్తులో రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చివరకు పౌరసత్వమే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని భట్టి విక్రమార్క హెచ్చరించారు. అందువల్ల ప్రతి ఓటు హక్కును కాపాడటం కాంగ్రెస్ కార్యకర్తలు, బీఎల్ఏల బాధ్యత అని స్పష్టం చేశారు.నెల రోజులుగా వ్యక్తిగత పనులను పక్కనపెట్టి సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న బీఎల్ఏలను, వారికి అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే ప్రతి బీఎల్ఏ కుటుంబానికి, వారి పిల్లల విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.మధిర నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియలో మరణించిన వారి పేర్ల తొలగింపు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాల సవరణ వంటి పనులను బూత్‌ల వారీగా పూర్తి చేసి వంద శాతం నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.పీసీసీ ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రం ద్వారా ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్న ప్రతినిధులను అభినందించిన ఉప ముఖ్యమంత్రి, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

**- రేగళ్ల పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**- జ్వరాలు, మందుల నిల్వలు, పరిశుభ్రతపై అధికారులకు ఆదేశాలు**

**రేగళ్ల, జూలై 27 (అనంత జనశక్తి) :**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవల తీరును సమీక్షించారు.

ఆస్పత్రిలోని వార్డులు, ఆవరణ, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ఓపీ నమోదు, రోజువారీ రోగుల సంఖ్య, గత పది రోజుల జ్వర కేసుల వివరాలు తెలుసుకుని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జ్వర లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి వెంటనే చికిత్స అందించాలని చెప్పారు.రక్త పరీక్షల విభాగంలో మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవీ పరీక్షల కోసం అవసరమైన కిట్లు, ప్రయోగశాల సామగ్రిని పరిశీలించారు. మందుల నిల్వలు, గడువు తేదీలు, యాంటీ స్నేక్ వెనం ఇంజక్షన్ల లభ్యతను తనిఖీ చేసి, ఎలాంటి కొరత లేకుండా ముందస్తుగా నిల్వలు ఉంచాలని ఆదేశించారు.అనంతరం ఆయుష్ క్లినిక్‌ను సందర్శించి సేవలను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసిన కలెక్టర్, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల విశ్వాసం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు.



## 5 రూపాయలు భోజనం అద్భుతం


**- స్వయంగా భోజనం చేసి ప్రశంసించిన**

**- మానవ హక్కుల రాష్ట్ర కార్యదర్శి కర్ణ బ్రహ్మానందరెడ్డి**

**- నాగార్జునసాగర్ జులై 27 అనంత జనశక్తి న్యూస్**

నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ణ బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పేదల కోసం అందిస్తున్న ఐదు రూపాయలకే భోజన పథకం కేంద్రాన్ని సందర్శించారు.ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్కడికి వచ్చిన నిరుపేదలతో పాటు వరుసలో నిలబడి స్వయంగా భోజనం చేశారు.భోజన రుచి,నాణ్యత మరియు శుభ్రతను పరిశీలించిన ఆయన పేద ప్రజలకు అందించే భోజనం ఎంతో అద్భుతంగా, రుచికరంగా ఉందని ప్రశంసించారు.ప్రభుత్వ పథకం క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలకు ఎంతో సద్వినియోగమవుతోందని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నల్గొండ జిల్లా కార్యదర్శి చెంగలి జంగన్న, ఉద్యమకారుల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధు,పెద్దవూర మండల అధ్యక్షులు వాసు,చంద్రయ్య పలువురు స్థానిక నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌ల సైబర్ మోసాలు.. అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతులు

డిజిటల్ లావాదేవీలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రస్తుత కాలంలో, క్యూఆర్ కోడ్ స్కాన్‌లు మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారాయి. చిన్న టీ కొట్టు నుండి పెద్ద షాపింగ్ మాల్ వరకు, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు వేగంగా సులభంగా జరుగుతున్నాయి. అయితే, ఈ సౌలభ్యం వెనక, సైబర్ నేరగాళ్లు సృష్టించిన 'క్యూఆర్ ఫిషింగ్' అనే కొత్త ప్రమాదం దాగి ఉంది. ఇది అమాయక ప్రజల ఆర్థిక భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తోంది. ఇటీవల కాలంలో, ఇటువంటి మోసపూరిత సంఘటనలు లక్షలాది రూపాయల నష్టానికి దారితీస్తున్నాయి, డిజిటల్ లావాదేవీల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతున్నాయి.



మాల్వేర్ ఇంజెక్షన్ ప్రమాదం

క్యూఆర్ ఫిషింగ్ మోసం ఒక తెలివైన పన్నాగం. ఇందులో నేరగాళ్లు నకిలీ క్యూఆర్ కోడ్‌లను సృష్టిస్తారు. ఈ కోడ్‌లు సాధారణంగా కనిపించే దుకాణాలు, వెబ్‌సైట్‌లు, లేదా ప్రభుత్వ పథకాల పేర్లతో ప్రచారం అవుతాయి. బాధితులు ఈ కోడ్‌లను స్కాన్ చేయగానే, వారిని ఫిషింగ్ వెబ్‌సైట్‌లకు లేదా మోసపూరిత యాప్‌లకు దారి మళ్లిస్తారు. ఆ వెబ్‌సైట్‌లు లేదా యాప్‌లు నిజమైన వాటిలాగే కనిపిస్తాయి. అయితే, ఈ నకిలీ ప్లాట్‌ఫామ్‌ల వెనక దాగి ఉన్న అత్యంత ప్రమాదకరమైన అంశం మాల్వేర్, స్పైవేర్ ఇంజెక్షన్.

బాధితులు తమ బ్యాంక్ వివరాలు, యూపీఐ పిన్, లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయమని అడిగే ముందు, లేదా అడిగిన తర్వాత, వారి డివైజ్‌లలో హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను రహస్యంగా ఇన్‌స్టాల్ చేసే అవకాశం ఉంది. ఈ మాల్వేర్



స్పైవేర్, బాధితుల ఫోన్‌ల నుండి వారి సున్నితమైన ఆర్థిక సమాచారాన్ని, వ్యక్తిగత డేటాను దొంగిలించడానికి ఉపయోగపడుతుంది.

"క్విషింగ్" అని పిలువబడే ఈ పద్ధతి, సాంప్రదాయ ఫిషింగ్ పద్ధతులకు భిన్నంగా ఉంటుంది. ఇందులో నేరగాళ్లు కనిపించే హైపర్‌లింక్‌కు బదులుగా స్కాన్ చేయగల క్యూఆర్ కోడ్‌ను ఉపయోగిస్తారు. ఇది మోసాన్ని గుర్తించడం కష్టతరం చేస్తుంది. అనేక సందర్భాలలో, దుకాణాల వెలుపల ఉన్న నిజమైన క్యూఆర్ కోడ్‌లను రాత్రికి రాత్రే నకిలీ వాటితో మార్చేసి, చెల్లింపులను మోసగాళ్ల ఖాతాలకు దారి మళ్లిస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.



రెస్టారెంట్‌లలో మెనూలను యాక్సెస్ చేయడానికి, మాల్స్‌లో పార్కింగ్ చెల్లింపులకు, లేదా ఇతర సేవల కోసం క్యూఆర్ కోడ్‌ల వినియోగం పెరిగింది. ఈ సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని, మోసగాళ్లు నకిలీ క్యూఆర్ కోడ్‌లను అతికించి, వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఈ ప్రక్రియలో, వారి డివైజ్‌లలో హానికరమైన కోడ్‌ను చొప్పించే ప్రయత్నం జరుగుతుంది. ఇది సైబర్ నేరగాళ్లు మీ వ్యక్తిగత గోప్యతను, ఆర్థిక భద్రతను లక్ష్యంగా చేసుకునే తీరును స్పష్టం చేస్తుంది.

సున్నితమైన సమాచారానికి ముప్పు

క్యూఆర్ ఫిషింగ్ మోసాలను గుర్తించడం చాలా ముఖ్యం. కొన్ని జాగ్రత్త సంకేతాలు ఇక్కడ ఉన్నాయి. మీకు తెలియని వారి నుండి లేదా ఊహించని విధంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని అభ్యర్థన వస్తే జాగ్రత్త వహించండి.

క్యూఆర్ కోడ్ ద్వారా ఏదైనా యాప్ డౌన్‌లోడ్ చేయమని అడిగితే, అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఈ కోడ్‌లు మిమ్మల్ని నకిలీ యాప్ స్టోర్‌లకు లేదా నేరుగా మాల్వేర్ డౌన్‌లోడ్‌లకు దారితీసే అవకాశం ఉంది. మీ ఫోన్‌కు తెలియని మూలాల నుండి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం మీ వ్యక్తిగత డేటాను, ఆర్థిక సమాచారాన్ని ప్రమాదంలో పడేస్తుంది.

అలాగే, మోసగాళ్లు నకిలీ లాగిన్ పేజీలను సృష్టించి, మీరు క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసిన తర్వాత మీ బ్యాంక్ వివరాలు, సోషల్ మీడియా లాగిన్‌లు లేదా ఇతర కీలక సమాచారాన్ని నమోదు చేయమని అడుగుతారు. ఈ నకిలీ లాగిన్ పేజీలు నిజమైన వాటిలాగే కనిపిస్తాయి.

# ఉదయం ఈ 5 ఆయుర్వేద పద్ధతులతో వర్షా కాలం వ్యాధులను జయించండి





వర్షా కాలం అందంగా, ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ, ఆరోగ్యపరంగా చూస్తే అంత అనుకూలమైనది కాదన్నది వాస్తవం. ఈ కాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం, జీర్ణక్రియ మందగించడం, అంటువ్యాధుల ప్రమాదం పెరగడం వంటి సమస్యలు సర్వసాధారణం. ఉదయాన్నే తక్కువ శక్తితో ఉండటం అనేది చాలా మందిలో కనిపించే ఫిర్యాదు. ఇది మన దైనందిన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందుకే, ఈ సమయంలో ఆరోగ్యకరమైన, స్థిరమైన ఉదయ ప్రారంభం చాలా ముఖ్యమని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. జివా ఆయుర్వేద వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్ చౌహాన్ మాట్లాడుతూ, సంపూర్ణ జీవనశైలిని అలవర్చుకోవడం వల్ల రోజును సమతుల్యంగా, ఉత్సాహంగా ప్రారంభించవచ్చని వివరించారు. ముఖ్యంగా వర్షా కాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వంటి అనేక కాలానుగుణ ఆరోగ్య సవాళ్లు ఎదురవుతాయి కాబట్టి ఇది మరింత అవసరం.

"వర్షా కాలం అంటువ్యాధులు, మందగించిన జీర్ణక్రియ, తక్కువ రోగనిరోధక శక్తితో మీ శరీరం ఇబ్బంది పడుతుంది." అని డాక్టర్ చౌహాన్ అన్నారు. "ఆయుర్వేదం ప్రకారం, సీజన్ల మధ్య మార్పు అనేది ఒక కీలక సమయం. ఈ సమయంలో మీ శరీరం యొక్క సహజ సమతుల్యత సులభంగా చెదిరిపోతుంది. అందుకే రోగనిరోధక శక్తిని పెంచే అలవాట్లను అలవర్చుకోవడం చాలా ముఖ్యం, ముఖ్యంగా ఉదయం పూట మీ శరీరం సానుకూల మార్పులకు ఎక్కువగా గ్రహణశీలత కలిగి ఉంటుంది" అని ఆయన నొక్కి చెప్పారు.

1. గోరువెచ్చని నీటితో రోజును ప్రారంభించండి

మీ రోజును ఒక గ్లాసు గోరువెచ్చని నీటితో ప్రారంభించండి. ఇది శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడానికి, జీర్ణక్రియను ప్రేరేపించడానికి, మీ శరీరాన్ని రోజు వారి పనులకు సిద్ధం చేయడానికి సహాయపడుతుంది.

2. డీటాక్స్ కోసం ఆయిల్ పుల్లింగ్

నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనెను నోటిలో 5-10 నిమిషాల పాటు పుక్కిలించడం వల్ల నోటిలోని విష పదార్థాలను తొలగించవచ్చు. చిగుళ్ల



ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. ఈ పురాతన ఆయుర్వేద పద్ధతి ఆశ్చర్యకరంగా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది చాలా ప్రశాంతంగా కూడా ఉంటుంది.

3. రోజువారీ రక్షణ కోసం హెర్బల్ టీ

తులసి, అల్లం, మిరియాలు కలిపి హెర్బల్ కషాయం తయారు చేసుకోండి. ఇది తేలికగా, సువాసనతో ఉంటుంది. ఇది చేయడానికి ఎక్కువ సమయం పట్టదు. ఇది పేరుకుపోయిన శ్లేష్మాన్ని తొలగించడానికి, జీర్ణ అగ్నిని ప్రజ్వలింపజేయడానికి, కాలానుగుణ వ్యాధికారక క్రిములకు వ్యతిరేకంగా సహజ రక్షణగా పనిచేస్తుంది.


4. ఊపిరితిత్తులను ఉత్తేజపరచడానికి ప్రాణాయామం



కొన్నిసార్లు లోతైన శ్వాస వ్యాయామాలు, ముఖ్యంగా అనులోమ విలోమ లేదా భస్త్రిక వంటి ప్రాణాయామాలు ఆక్సిజన్ ప్రవాహాన్ని పెంచుతాయి. దోషాలను సమతుల్యం చేస్తాయి. మీ శ్వాసకోశ వ్యవస్థను బలంగా ఉంచుతాయి. దీన్ని ఖాళీ కడుపుతో, శుభ్రమైన ప్రదేశంలో చేయండి.

5. అభ్యంగం లేదా స్వయం మర్దనం

స్నానానికి ముందు గోరువెచ్చని ఔషధ నూనెతో మీ శరీరాన్ని మర్దనం చేయడం వల్ల చర్మానికి పోషణ లభిస్తుంది. కండరాలు విశ్రాంతి పొందుతాయి. లింఫాటిక్ డ్రైనేజీకి సహాయపడుతుంది. ముఖ్యంగా వర్షా కాలంలో వాతావరణం తేమగా ఉండి, భారంగా లేదా అలసటగా అనిపించినప్పుడు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



అనంత జనశక్తి
మంగళవారం | రంగారెడ్డి
28.07.2026


# మీరు మీలా ఉంటే.. చాలు: నటి రష్మిక


రష్మిక

చిత్రసీమలో దక్షిణాది నుంచి ఉత్తరాది వరకూ.. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ వైవిధ్యమైన పాత్రలతో సినీప్రియుల్ని అలరిస్తోంది అందాల తార రష్మిక. అగ్రతారల సరసన అవకాశాలను అందిపుచ్చుకుంటూనే నాయికా ప్రాధాన్య చిత్రాలను తన ఖాతాలో వేసుకుంటుంది. పాన్ ఇండియా స్థాయిలో కథానాయికగా సత్తా చాటుతున్న ఈ భామ ఇటీవల ఓ కార్యక్రమంలో తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. "ఏ మూస పద్ధతిలోనూ ఇమడకుండా పూర్తిగా కొత్త చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం నా జీవితంలోని అద్భుతమైన ప్రయాణం. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరికీ ఓ ప్రణాళిక ఉండేది. అందుకే నాకు మొదట్లో భయంగా అనిపించింది. కానీ, నేను నా అంతరాత్మ చెప్పిందే అనుసరించేదాన్ని. కెరీర్‌లో ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అదే నా ప్రయాణాన్ని ప్రత్యేకంగా నిలిపిందని అనిపిస్తుంది. మనల్ని ఇతరుల నుంచి భిన్నంగా చూపే విషయాలే మనకు అతిపెద్ద బలం అని తెలుసుకున్నాను. అందరిలో కలిసిపోవాలనుకుని.. వారితో ప్రతి విషయంలోనూ ఇమిడిపోవాల్సిన అవసరం లేదు. మీరు మీలా ఉంటే చాల"ని చెప్పుకొచ్చింది.

# మనల్ని మనం చూసుకునే విధానమే.. అసలైన విజయం


హ్యూమా ఖురేషి

తననొక మూస పద్ధతిలో చూపించడాన్ని సహించలేనంటోంది బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషి. ఇటీవలే 'బేబీ డు డై డు' నాయికా ప్రాధాన్య సినిమాతో థియేటర్లలో సందడి చేసిందీ తార. త్వరలోనే యశ్ 'టాక్సిక్' చిత్రంలో కనిపించనుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో హ్యూమా మాట్లాడుతూ.. "కెరీర్ ప్రారంభంలో ప్రేక్షకులందరికి నేను తెలియాలనుకున్నా. కానీ ఈరోజు నేను చేసే పని, దానికి సహకరించే వారిని ఎంచుకోవడం.. నచ్చని పాత్రలకు నో అని చెప్పగలగడమే అసలైన విజయమని తెలుసుకున్నా. నటిగా మనల్ని మనం చూసుకునే విధానమే నా దృష్టిలో సక్సెస్. అందుకే నన్నొక మూస పద్ధతిలో చూపించడాన్ని సహించలేను. ఒక నటిగా నేను చేయగలిగేది చాలా ఉంది. అలా అని ఒక పనిని చాలా బాగా చేయగలనని, అవకాశం ఇవ్వమని ఎవ్వరినీ బలవంతం చేయను. నాకు వచ్చే అవకాశాలను మాత్రమే సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తా. ఒకే ఏడాదిలో రెండు వైవిధ్యమైన పాత్రలు చేయగలననే విషయంలో నేను చాలా గర్వపడతాను. నటిని కాబట్టి నా వయసు మార్చుకోగలను, తగ్గించుకోగలను. ఏమైనా చేయగలను. ఇతరుల ఆలోచనలు, అంచనాలు అనే సంకెళ్ల నుంచి మాత్రం విముక్తి పొందాలనుకుంటున్నా" అని అంది.


మాళవిక మోహనన్

# నాయికలతోనే ఆ మార్పు రాదు

"వెండితెరపై మహిళా ప్రాధాన్య పాత్రల్లో నిజమైన మార్పు రావాలంటే కేవలం నటీమణుల వల్ల మాత్రమే రాదు. చిత్ర పరిశ్రమలో ఇతర విభాగాల్లోనూ మహిళల సంఖ్య పెరగాల"ని అంటోంది కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. కమర్షియల్ సినిమాల్లో మహిళలకు విభిన్నమైన పాత్రలు రాకపోవడానికి గల కారణాల గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకుంది. "వాస్తవానికి సినీ పరిశ్రమలో మనకు ఎక్కువ మంది మహిళా దర్శకులు, రచయితలు లేరు. మహిళా దర్శకులు కూడా కేవలం కొద్దిమంది మాత్రమే ఉన్నారు. ఎప్పుడైతే ఫీమేల్ మేకర్స్ ఎక్కువగా ఉంటారో అప్పుడే నటీమణులకు కూడా యాక్షన్ పాత్రల్లో నటించే అవకాశాలు వస్తాయని నేను కచ్చితంగా చెప్పగలను. నిజం చెప్పాలంటే గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. హాలీవుడ్ యాక్షన్ చిత్రం 'కిల్ బిల్' తరహాలో నటించడమనేది నా కల" అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం మాళవిక మోహనన్ 'సర్దార్ 2', 'పాకెట్ నావెల్' చిత్రాలతో బిజీగా ఉంది.

# రామ్‌చరణ్ మణికట్టుకు నేడు శస్త్రచికిత్స

ప్రముఖ కథానాయకుడు రామ్‌చరణ్‌కు నేడు కోయంబత్తూర్ నగరంలోని ఓ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరగనుంది. 'పెద్ది' సినిమా చిత్రీకరణలో ఆయనకు మణికట్టు బెణికి తీవ్ర గాయమైంది. ఒకవైపు చికిత్స పొందుతూనే, మరోవైపు ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి శస్త్రచికిత్స ఒక్కటే పరిష్కారమని వైద్యులు సూచించినట్టు సమాచారం. దాంతో కోయంబత్తూరులోని ఓ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు రామ్‌చరణ్. అందుకోసం ఆదివారం హైదరాబాద్ నుంచి కోయంబత్తూరుకు బయల్దేరి వెళ్లారు. రామ్‌చరణ్‌పాటుగా ఆయన భార్య ఉపాసన, తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖ కూడా ఉన్నారు. 'పెద్ది' చిత్రీకరణలోనే రెండుసార్లు గాయపడ్డారు రామ్‌చరణ్. మొదట నుదుటిపై గాయం కాగా, హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. రామ్‌చరణ్ తదుపరి చిత్రం సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా చిత్రీకరణ దలయ్యేలోపు గాయాల నుంచి పూర్తిగా కోలుకోవాలనే లక్ష్యంతో ఉన్నారు రామ్‌చరణ్.




# భారత క్రికెట్‌కు నూతన వైభవం.. జట్టులో కుదురుకున్న సూర్యవంశీ




1989లో 16 ఏళ్ల కుర్రాడొకడు నీలి రంగు భారత క్రికెట్ జెర్సీ వేసుకుని మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేయడమే ఒక ఎత్తైతే.. అద్భుతమైన ఆటతీరుతో క్రికెట్ ప్రపంచాన్ని ఊపేయడం ఇంకో ఎత్తు. కాల క్రమంలో ఆ కుర్రాడు ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా పేరు సంపాదించాడు. ఈ ఉపోద్ఘాతమంతా సచిన్ తెందుల్కర్ గురించే అని ఈపాటికే అర్థమై ఉంటుంది. ఇటీవలే భారత జట్టుకు ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా సచిన్ రికార్డును బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ.. కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాడు. అతను అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగు పెట్టడానికి ముందే మాస్టర్ బ్లాస్టర్‌ను మించి క్రేజ్ సంపాదించి.. తన అరంగేట్రం గురించి క్రికెట్ ప్రపంచమంతా మాట్లాడుకునేలా చేశాడు. అరంగేట్ర సిరీస్‌లో తడబడ్డప్పటికీ.. ఇప్పుడు జింబాబ్వే పర్యటనలో నిలకడగా రాణించి తన ముద్రను చాటాడు. 16 ఏళ్ల 205 రోజులు.. 1989లో అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటికి సచిన్ తెందుల్కర్ వయసు ఇది. అంత చిన్న వయసులో సచిన్ భారత జట్టుకు ఆడటం చూసి అప్పుడు అందరూ అబ్బురపడ్డారు. భారత్ తరఫున అతి పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్ ఆడిన ఆటగాడిగా 37 ఏళ్ల పాటు ఆ రికార్డు నిలిచి ఉంది. ఇప్పుడు వైభవ్ ఆ రికార్డును పెద్ద తేడాతో బద్దలు కొట్టేశాడు. వైభవ్ 15 ఏళ్ల 99 రోజుల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ ఆడడం విశేషం. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌లకు ఎంపికైన అతను.. ఐర్లాండ్‌లో అవకాశం దక్కించుకోలేకపోయాడు. అక్కడే తన అరంగేట్రం జరుగుతుందని అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూడగా.. అది జరగలేదు. ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ వైభవ్ ఆడకపోవడంతో మరోసారి నిరాశే ఎదురైంది. అయితే, వరుసగా మూడు టీ20ల్లో సంజు శాంసన్ విఫలం కావడంతో వైభవ్‌కు అవకాశం ఇవ్వక తప్పలేదు. ఇంగ్లాండ్ రెండో టీ20లో వైభవ్ తుది జట్టులో అడుగు పెట్టాడు.

ఐతే ఆ సిరీస్‌లో వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లో 14, 13, 15 పరుగులే చేయడంతో వైభవ్ మీద విమర్శలు తప్పలేదు. తన సామర్థ్యం మీద సందేహాలు తలెత్తాయి. ఇండియాలోని ఫ్లాట్ పిచ్‌లపై మాత్రమే రాణించగలడా అన్న చర్చ జరిగింది. కానీ జింబాబ్వే పర్యటన రూపంలో దక్కిన మరో అవకాశాన్ని అతను పూర్తిగా ఉపయోగించుకున్నాడు. తొలి టీ20లో తనదైన శైలిలో మెరుపులు మెరిపిస్తూ 19 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. రెండో టీ20లో 20 పరుగులకు ఔటైన అతను.. మూడో మ్యాచ్‌లో 49 బంతుల్లో 81 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అడ్డదిడ్డంగా షాట్లు ఆడేయకుండా సంయమనం పాటించిన వైభవ్.. పరిస్థితులకు తగ్గట్లు ఆడి తన పరిణతిని చాటాడు. తనకు అంతర్జాతీయ క్రికెట్లో తొలి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది ఈ మ్యాచ్‌లోనే. అంతే కాదు.. అతను 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డునూ దక్కించుకున్నాడు.

అరంగేట్రానికి ముందే స్టార్

టీమ్‌ఇండియా లోకి వైభవ్ రాకతో భారత క్రికెట్లో నవశకం మొదలైనట్లే. ఆటలో వైభవ్ ఏ స్థాయికి ఎదుగుతాడన్నది భవిష్యత్ నిర్ణయిస్తుంది కానీ.. అరంగేట్రం చేయడానికి ముందే అతను భారత క్రికెట్లో పెద్ద స్టార్ అయిపోయాడు. కెరీర్ మొదలుపెట్టకముందే భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించాడు. గత ఏడాదిన్నర కాలంలో అతడి పేరు అంతగా మార్మోగింది మరి. ప్రస్తుత భారత టీ20 జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ లాంటి స్టార్లు ఉన్నా.. వారిని మించిన స్టార్ ఇమేజ్‌ను అరంగేట్రానికి ముందే వైభవ్ సాధించేశాడంటే అతిశయోక్తి కాదు. క్రికెట్ మ్యాచ్‌ల మోతాదు బాగా ఎక్కువైపోయి... జనాలకు మొహం మొత్తేసిన పరిస్థితులను కొన్నేళ్లుగా చూస్తున్నాం. ఇంతకుముందులా మ్యాచ్‌లను ఆద్యంతం ఆసక్తిగా చూడడం తగ్గిపోతోంది. అందులోనూ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టులు, టీ20లకు దూరం కావడంతో ఆ ఫార్మాట్లలో భారత క్రికెటర్ల ఆట చూడాలని అభిమానులు తహతహలాడడే రోజులు ఇప్పుడు లేవు.

టెస్టులకు ఆదరణ బాగా తగ్గిపోయింది. టీ20ల కోసం స్టేడియాలకు జనం వస్తున్నారు కానీ.. టీమ్ ఇండియాకు మునుపటి ఆకర్షణ లేదన్నది మాత్రం వాస్తవం. అభిషేక్ శర్మకు కొంత ఫాలోయింగ్ ఉంది కానీ.. కోహ్లి, రోహిత్ లకు అతను దరిదాపుల్లో ఉండడు. ఇలాంటి టైంలో వైభవ్ సూర్యవంశీ.. రో-కో తరహాలోనే తన కోసం స్టేడియాలకు అభిమానులను రప్పించే ఆటగాడవుతాడనే అంచనాలు నెలకొన్నాయి. ఈ ఐపీఎల్‌లో వీర విధ్వంసంతో ఆ స్థాయిలో ఫాలోయింగ్ సంపాదించాడు వైభవ్. నిజానికి గత సీజన్లతో పోలిస్తే ఈ ఐపీఎల్ అంత హోరాహోరీగా, ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా సాగలేదు. అయినా లీగ్ ఆకర్షణ తగ్గకుండా చూడడంలో వైభవ్ పాత్ర కీలకం. 13 ఏళ్లకే ఐపీఎల్ వేలంలో రూ1.1 కోట్లు దక్కించుకున్నపుడు ఆ వయసు పిల్లాడిని వేలంలో కొనడమేంటి, అదీ అంత రేటుగా అని చాలామంది తేలిగ్గా మాట్లాడారు. కానీ నిరుడు 14 ఏళ్ల వయసులోనే వైభవ్ ఐపీఎల్ అరంగేట్రం చేయడమే కాక 38 బంతుల్లో మెరుపు శతకం బాది ఔరా అనిపంచాడు.

ఇక ఈ ఏడాది విధ్వంసక ఇన్నింగ్స్‌లతో ఐపీఎల్ అభిమానులను ఒక ఊపు ఊపేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్లో అభిమానులతో పాటు విశ్లేషకులు, మాజీల చర్చలన్నీ తన చుట్టూనే తిరిగాయి. ఈ ప్రదర్శనతో తనను టీమ్‌ఇండియాకు ఎంపిక చేయని పరిస్థితి కల్పించాడు వైభవ్. స్వయంగా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కరే ఈ విషయం చెప్పాడు. ఇప్పటిదాకా అండర్-19 జట్టుకు ఆడినా.. ఐపీఎల్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించినా.. ఇండియా-ఎ జట్టు తరఫున బరిలోకి దిగినా.. వైభవ్ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఆడాడు. అందరి దృష్టి తన మీదే నిలిచేలా చేశాడు. బౌలర్లను తనను చూసి బెంబేలెత్తేలా, ప్రత్యేకంగా వ్యూహాలు రూపొందించేలా చేశాడు.

తనను కట్టడి చేయడానికి మూడు రకాల వ్యూహాలున్నాయన్న సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్‌కు అతనెలా చుక్కలు చూపించాడో తెలిసిందే. తాజాగా 'ఎ' జట్ల ముక్కోణపు సిరీస్‌లో శ్రీలంక ఆటగాళ్లు తనను కవ్విస్తే.. ఫైనల్లో మెరుపు ఇన్నింగ్స్‌తో వారికి ఎలా బుద్ధి చెప్పాడో అభిమానులు చూశారు. ఇలాగే అంతర్జాతీయ క్రికెట్లోనూ మెరుపులు మెరిపించి టీమ్‌ఇండియాలో కొత్త సూపర్ స్టార్‌గా ఎదుగుతాడని.. తన ఆకర్షణతో స్టేడియాలను నింపుతాడని.. టీవీల ముందు కూడా కోట్లాది మందిని కూర్చోబెడతాడని వైభవ్ మీద అంచనాలున్నాయి. జింబాబ్వే సిరీస్‌తో ఆ దిశగా ఆశలు రేకెత్తించాడు. మరి ముున్ముందూ ఇంతే నిలకడగా రాణించి నవతరం సూపర్ స్టార్‌గా మారతాడేమో చూడాలి.

# ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్.. ఇషా సింగ్‌కు స్వర్ణం

హాంగ్‌ఝౌలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత యువ షూటర్ ఇషా సింగ్ సత్తాచాటింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఒలింపిక్ పతక విజేత మనూ బాకర్‌ను ఓడించి ఇషా సింగ్ స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్‌లో ఈ హైదరాబాదీ షూటర్ నిలకడ ప్రదర్శించి 40 హిట్స్‌తో బంగారు పతకాన్ని గెల్చుకుంది. కాంస్య పతకం కోసం మనూ బాకర్ పోరాడాల్సి వచ్చింది. షూట్ ఆఫ్‌ను దాటుకుని వచ్చిన మను.. 28 హిట్స్‌తో మూడో స్థానంలో నిలిచింది. అంతకు ముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో భారత షూటర్లు అదరగొట్టారు. మనూ బాకర్ 586-20x స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా.. 21 ఏళ్ల ఇషా సింగ్.. 585-18x స్కోరుతో రెండో స్థానంలో నిలిచినప్పటికీ ఫైనల్‌లో మాత్రం అదిరిపోయే ప్రదర్శనతో స్వర్ణ పత కాన్ని కొల్లగొట్టింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945